# కాయితం పులి

(ఒకానొక ఊళ్లో ఒక రామాలయం......ఉత్సవాల సందడి........ఓ కీర్తనకారుడు ఇద్దరూ వాద్యగాళ్ళు
రామమహిమ గానం చేస్తూ వుంటారు....చాలామంది శ్రోతలున్నారు.)

**కీ.కా** : బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి॥
శ్రీరామ జయరామ శృంగారరామ
కారుణ్య గుణధామ కల్యాణరామ॥

భక్తులందరికీ స్వాగతం....ఈ సీతారాముల కల్యాణోత్సవాలలో మమ్మల్ని యింత దూరం పిలిపించి యీ భజన కార్యక్రమం ఏర్పాటు చేసిన భక్త పరమాణువులకు ఆశీస్సులు...ఆ సీతారాముల చల్లని చూపువారికి అండగా ఉండాలని మా ప్రార్థన.........

ఇక నామ సంకీర్తనం ప్రారంభిద్దామా?
శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
.........
అనేకదంతం భక్తానాం ఏకదంతము పాశ్మహే॥
వందనమయ్యా గణనాధా
సిద్ధివినాయక గణనాధా॥
కరుణాసాంద్రా గణనాదా
గిరిజాతనయా గణనాధా॥
మొదటి వేలుపువు గణనాధా నీకు
వందనమయ్యా గణనాధా॥
కొలిచి మొక్కెదము గణనాధా॥
విఘ్నములన్నిటి గణనాధా నువ్వు
తొలిగించుమురా గణనాధా॥

తనువంతా శ్రమ చందనమై
కనులే ఆశల నందనమై
సత్యవచనమే సదానందమై
అలరారే ఆ గిరిజాసుతడవు॥

వందనమయ్యా గణనాథా।
సిద్ధివినాయక గణనాథా॥

భక్తులారా! ఈ రోజు చాలా పుణ్యదినం.....రాముల వారి మహిమను చెప్పుకుంటూ గడిపే ఏక్షణమైనా పుణ్యమే! అయితే – పాప పుణ్యాల బేరీజు ఏమిటయ్యా – అని మీరడగొచ్చు నాయనలారా! నిరంతరం దారుణాలు చేస్తూ నిర్భగ్యుల్ని అణగతొక్కే దానవులను సంహరించి అమాయకులను రక్షించడానికే మహాపురుషులు జన్మిస్తారు.

ధరమ సంస్థాప నార్థాయ
సంభవామి యుగేయుగే – అన్నారు కదండీ!

ఈ విధంగా జన్మించిన మహానుభావుడే రాములవారు..........

**వంత1 :** అవును. బీదలపాలిటి కల్పవృక్షం రాముడొక్కడే అని సూరదాసు చెప్పాడు.

**కీ.కా :** అంటే – ధనవంతులకు రాముడితో పనిలేదనా నాయనా?....కాదు. రామనామం దొంగలెత్తుకు పోలేని సొత్తు...అని ఆయన భావం.

**వంత2 :** ఎంత దోచుకున్న తరగని ధనం – నిధి – రామనామం......

**కీ.కా :** చూశారా! రామనామాన్ని డబ్బు మూటల్తో పోల్చాలంటే మన సర్వసంగ పరిత్యాగులకు కూడా డబ్బు విలువ ఎంత తెలుసో? ఈ మాయా ప్రపంచం తుచ్ఛమైనదే అయినా, దాన్ని శాసించే డబ్బు ఉంది చూశారూ – అది మాత్రం చాలా మహత్తు కలది. అన్ని సంఘర్షణలకీ మూలం ధనం. అధికారానికి మూలం ధనం.....అవునా? ఈ డబ్బు మహిమ మన పూర్వీకులు బాగా తెలుసు. సాక్షాత్తు వ్యాసభగవానుడే మన్నాడో వినండి.

అధనార్థి నివర్తంతే జ్ఞాతయ: సుహృదోద్విజా:
అపుష్పాద్ ఫలాద్ వృక్షాద్ యధాకృష్ణమ్ పతత్రిణ:॥

అన్నాడు....పూలు పళ్ళులేని మొండి చెట్టుని పక్షులు ఎలా వదిలి వెళ్ళిపోతాయో అలాగే దరిద్రుణ్ణి బంధువులు, ఇష్టమిత్రులు వదిలి పెడతారు – అని దీని తాత్పర్యం. అంతేనా?......ఇంకా మన పూర్వులు ఏమన్నారంటే?

ధన మాహు: పరంధర్మమ్ ధనే సర్వం ప్రతిష్ఠితమ్
జీవన్తి ధనిలో లోకే మృతాయే త్వధనా నరా:॥

డబ్బుని కలిగివుండడమే శ్రేష్ఠమైన ధర్మం....డబ్బు జీవితంలో అతి ముఖ్యమైన పాత్ర వహిస్తుంది కనక "జీవించడం" అంటే డబ్బున్న వాళ్ళు జీవించడమే నన్న మాట!......... సరే ఇంతకీ రామనామం ఎంత ధనాన్నిచ్చి అయినా కొనసాగగలిగే కాదు – అనే విషయం మీద కదా మన చర్చ! అటువంటి రాముల వారి మహిమను గురించి పాడుకుందాం.........

తక్కువేమీ మనకు రాముండొక్కడుండు వరకు॥

ప్రక్కతోడుగా భగవంతుడు తన
చక్రధారియై ప్రక్కన నుండగ ॥తక్కువేమి॥

................

హిరణ్యకశిపుని ఇరుప్రక్కలుగా
విరిచిన నరహరి ప్రక్కనుండగ ॥తక్కువేమీ॥

..............

దుష్టకంసుని ద్రుంచినట్టి శ్రీ
కృష్ణుడు మనపై కృపతో నుండగ ॥తక్కువేమీ॥

దుష్టశిక్షణ కోసమే అవతారం ఎత్తాడు రాములవారు......అవసరం అయినప్పుడు ఆంజనేయస్వామికి కొండంత బలాన్నిచ్చాడు. సుగ్రీవుడికి విజయం సాధించి పెట్టాడు. విభీషణుడికి రాజ్యం యిప్పించాడు...తాను స్వయంగా దుష్టుల్ని శిక్షించడమే కాక తన ఆప్తులు కూడా అదే విధంగా దుష్టశిక్షణ చెయ్యాలని ఆదేశించాడు. రామదాసు ఏమన్నాడు?

పాహిరామ ప్రభో – అని కొలుస్తూ
క్రమ్ముకొని శాత్రవులు హమ్మనుచు వచ్చెదరు
ఇమ్మయిన బాణమ్ము లిమ్ము రామ ప్రభో॥
అంటాడు..........

**శ్రోత 1 :** ఆపండి మీ రామభజన –

**కీ.కా :** ఏమన్నావ్ నాయనా?

**శ్రోత 1 :** ఎందుకండీ ఆ కంఠశోష? ఆ భజనమాని మీ మానాన మీరు వెళ్ళండి.

**వంత 1 :** హరిభజనలో విఘ్నాలేమిటయ్యా?

**వంత 2 :** ఏదో కృష్ణ, రామా అనుకుంటూ వుంటే నీకేం ఇబ్బంది నాయనా?

**శ్రోత 2 :** ఆయన మాటలకేం గాని, మీ భజన అందుకోండి స్వామీ!

**శ్రోత 3 :** అంత ఇబ్బందిగా వుంటే ఆయన్నే లేచి పొమ్మనండి.

**కీ.కా :** తప్పు బాబు! (1వ శ్రోతతో) ఇటురా నాయనా!......కూర్చో – చూడు నాయనా – ఎందుకు భజన మానమంటున్నావ్? ఈ ఊరి వాళ్ళంతా చందాలు పోగుచేసి మరీ మమ్మల్ని పిలిపించారు గదా, హరిభజన మధ్యలో ఆపి ఎందుకు వెళ్ళాలి నాయనా?

**శ్రోత 1 :** ఈ ఊళ్ళో మీరిట్లా ఎన్నాళ్ళు భజనలు చేసినా ఏమీ లాభం లేదు.

**వంత 1 :** అదే! ఎందుకనే మేం అడిగేదీ?

**వంత 2 :** అసలు విషయమేమిటో చెప్పవయ్యా?

**శ్రోత 2 :** ఏమిటయ్యా చెప్పేది? వాణ్ణి అవతలికి లాగెయ్యక – (ఇద్దరు ముగ్గురు లేస్తారు)

**కీ.కా :** ఆగండి......ఏదో పెద్ద కారణం ఉంటేనేగాని అతనలా అనడు.....ఏం బాబూ? మేం భజన మానేసి పోతే నీకేం లాభం?

శ్రోత 1 : నాకేం లాభమండీ? కాని, ఇక్కడ మాత్రం రాములవారిని కొలుస్తూ పాడకండి. అంతే!

వంత 1 : అదే, ఎందుకూ అని.

కీ.కా : భయం లేదు నాయనా! చెప్పు -

శ్రోత 1 : భయమయితే అసలా ప్రసావనే తెచ్చేవాణ్ణి కాదు. అదంతా ఎందుకు? మీ పురాణాలకి, భజనలకి ఇది అనువైన చోటు కాదు.

వంత 2 : ఇది రామాలయం. రామనామస్మరణ చేసుకోవడానికి ఇంతకన్నా మంచి చోటు ఎక్కడ వుంటుంది?

శ్రోత 1 : కాదు. ఇది పాపపంకిలమైన చోటు.....భజనలు చేసే చోటు కాదు...ఇక్కడ.......

కీ.కా : ఇక్కడ - ?

శ్రోత 1 : అదంతా ఎందుకులెండి........

వంత 2 : ఇంతవరకు ఓట్రించావు......ఇప్పుడు భయపడుతున్నావా?

శ్రోత 1 : లేదు. నాకు భయంలేదు....కాని నిజం చెబితే నన్ను బతకనివ్వరు...నన్నే కాదు. నా వాళ్ళెవర్నీ బతకన్వీరు...నాకు తెలుసు ....అందుకే -

కీ.కా : నీకేం భయంలేదు....నీ మీద ఎవ్వరన్నా చెయ్యి లేపితే మేం అందరంలేమూ? చెప్పు.....ఈ చోటు ఎందుకని పాపపంకిలం అయిందన్నావు?

శ్రోత 2 : చెప్పవయ్యా, చెప్పు.

శ్రోత 3 : తొందరగా చెప్పవయ్యా

అందరూ : చెప్పవయ్యా.....చెప్పు.....చెప్పవేం?

శ్రోత 1 : వీళ్ళంతా నన్ను చెప్పమంటున్నారు కదూ! తీరా అసలు విషయం చెప్పాక ఇక్కణ్ణుంచి అందరూ ఉడాయిస్తారు....మమ్మల్ని మాత్రం పట్టుకుని చిదకబాదేస్తారు......మా ప్రాణాలు దక్కవు.

కీ.కా : మళ్లీ అదేమాటా? ఇక్కడేం జరిగిందో నువ్వు చెప్పితీరాలి.

శ్రోత 1 : చెప్పమంటారా?......ఇక్కడ.......ఈ గుడి వెనక.......

అందరూ : ఊ.....చెప్పు......

శ్రోత 1 : ఈ గుడివెనక దట్టంగా పొదలూ, చెట్లు ఉన్నాయి చూడండి -

శ్రోత 2 : ఉన్నయ్......ఉంటే -

శ్రోత 3 : చెప్పు.....ఏం జరిగిందో -

శ్రోత 1 : చెప్పను......చెబితే వీళ్ళంతా కలిసి నన్ను చంపుతారు.

కీ.కా : ఫరవాలేదు.....నేనున్నానుగా! చెప్పు.

శ్రోత 1 : ఇక్కడ సంవత్సరం కింద -

అందరూ : ఆ..........

శ్రోత 1 : ఒక బీద అమ్మాయి మీద అతి దారుణమైన అత్యాచారం జరిగింది. ఆ అత్యాచారాన్ని పెద్దలందరూ కలిసి ఇక్కడే భూస్థాపితం చేశారు - ఈ గుళ్ళోనే!

(అందరూ ఉలిక్కిపడి మొహమొహాలు చూసుకుంటారు)

కీ.కా : ఇది అసంభవం -

వంత1 : ఇంత దారుణమా?

వంత2 : కట్టుకథలా ఉంది.

శ్రోత1 : అత్యాచారం అంటేనే అంత ఉలిక్కి పడతారేం? ఆ తరువాత ఏం జరిగిందో తెలిస్తే –

కీ.కా : (శ్రోతలతో) ఇతను చెప్పేది నిజమేనంటారా?

శ్రోత2 : అబద్ధం.

శ్రోత3 : దీన్ని గురించి మాకేం తెలియదు.

శ్రోత2 : ఇటువంటి మాటవినడం ఇదే మొదటిసారి.....

అందరూ : అబద్ధం....ఇది అబద్ధం.....

శ్రోత1 : కాదు......కాదు.....నేను కళ్ళారా చూశాను – స్వయంగా – ఆమె బాధతో అవమానంతో అరుస్తూ ఆ పొదల వెంట పరిగెత్తడం చూశాను......సహాయం కోసం ఆమె చేసిన ఆర్తనాదం ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటోండి.....ఇది ముమ్మాటికి నిజం.

కీ.కా : ఆమె సహాయం కోసం అరిచిందా?......అది నువ్వు స్వయంగా విన్నావా? అయినా ఆమెను రక్షించే ప్రయత్నం చెయ్యలేదా?

శ్రోత1 : మీరన్నది నిజం....నేను రక్షించే ప్రయత్నం చెయ్యలేదు. వాళ్ళు.......అరడజను మంది.........

వంత1 : మరి ఊళ్ళో వాళ్ళని ఎందుకు పిలవలేదు?

వంత2 : అంత చేతకాని వాడివా?

శ్రోత1 : చేతకాని వాణ్ణే.......అప్పుడు నాకు ధైర్యం చాలలేదు......ఆ దృశ్యాన్ని చూసి నాకు నోట మాట రాలేదు....నా కాళ్ళు ఒణికాయి.....కళ్ళు బైర్లుకమ్మాయి.......

కీ.కా : ఎందుకంత భయం?

శ్రోత1 : ప్రాణభయమండీ! అవతలి వాళ్ళు ఎంత బలవంతులో మీకు తెలియద. నేను ఎవరినన్నా పిలిచినా, సహాయం కోసం అరిచినా, ఆ రాత్రికి రాత్రే నన్ను చంపి నా శవాన్ని కాలవగట్టు మీద పారేసేవాళ్ళు.

కీ.కా : అంత దుర్మార్గులా వాళ్ళు? నువ్వు చెబుతున్నది నీ ఊళ్ళో వాళ్ళని గురించేనని జ్ఞాపకం ఉంచుకో!

వంత1 : ఇది ప్రజాతంత్ర దేశం.....డెమోక్రటిక్ కంట్రీ –

వంత2 : ఇక్కడ ప్రతివాళ్ళకీ వాక్ స్వాతంత్ర్యం వుంది – ఫ్రీ ప్రెస్ –

వంత1 : జీవించే హక్కు అందరికీ సమానం

వంత2 : చట్టం దృష్టిలో అందరూ సమానం......

శ్రోత1 : ఇదంతా పుస్తకాల్లో జాగ్రత్తగా దుమ్ముకొట్టుకుపోతూ ఉంది. అందుకే, ఇంత జరిగినా ఆ అభాగ్యురాలి తండ్రి కూడా నోరుమూసుకున్నాడు.....ఊళ్ళో వాళ్ళు ఒక్కళ్ళు......ఒక్కళ్లు......మాట్లాడలేదు. అమ్మాయి మీద అత్యాచారం జరిపి చిత్రహింస చేసిన వాళ్లు ఈ కిరాతకాన్ని కిమ్మనకుండా భరించిన ఆ అమ్మాయి తండ్రీ – ఈ భజన జరుగుతున్న గుళ్ళోనే ఇక్కడే వున్నారు.

(కలకలం)

కీ.కా : అయితే ఈ దుర్మార్గులెవరో చెప్పు.

వంత1 : అవును.....నువ్వు చెప్పితీరాలి.

వంత 2 : ఈ పాపం ఇప్పుడే ఇక్కడే బద్దలు కావాలి.

శ్రోత 2 : చెప్పమనండీ.....

శ్రోత 3 : చెప్పవయ్యా......చెప్పు......

శ్రోత 1 : నేను చెప్పలేను......ఇప్పటికే నేను చాలా చెప్పాను.....దయచేసి మీరు ఇంత అపవిత్రమైన స్థలంలో రామభజన చెయ్యొద్దనే నా కోరిక. అంతే!

కీ.కా : అంత అధైర్యం మంచి లక్షణం కాదు......చీడ పురుగుల్ని లాగి పారేసేటప్పుడు చెట్టుకున్న ముళ్ళు గుచ్చుకోక తప్పదు..........

శ్రోత 1 : లేదండీ.........నాకు ధైర్యం చాలడం లేదు......అలా అని నేను చేతకాని వాణ్ణను కునేరు....కాని చెప్పినా ఫలితం లేనప్పుడు చేప్పేం ప్రయోజనం? ......కాసేపు చర్చించుకుంటాం......ఆ తరువాత మనకెందుకులే అని చప్పరిస్తాం......ఇది జరిగి అప్పుడే ఏడాది కావస్తోంది......చెప్పాలంటే నా దగ్గర రుజువేం లేదు. కాని...... ఆ భయంకరమైన దృశ్యం గుర్తొస్తే గుండెలు చిక్కబట్టినట్టవుతుంది.......అందుకే – కనీసం ఇక్కడ పురాణాలు చెప్పొద్దనీ, రామభజనలు చెయ్యొద్దనీ కోరుతున్నాను..........

కీ.కా : ఆ పాపులకు శిక్షబడకుండా చేస్తున్నావు నువ్వు.....

శ్రోత 1 : స్వామీ! శిక్షమాట దేవుడెరుగు.....నేనూ, నా వాళ్ళూ కులాసాగా ఉంటాం అనుకున్నారా? ఏదో ఒక నేరం మీద మమ్మల్ని సర్వనాశనం చేస్తారు. ఆ పుణ్యాత్ములే మిమ్మల్ని డబ్బులిచ్చి మరీ భజనలకి హరి కథలకి పిలుస్తారు....పెద్ద పెట్టున అన్నదానాలు చేస్తారు......దేవుళ్ళకి కొలుపులు చేయిస్తారు.....

కీ.కా : మేమేదో మీరిచ్చే డబ్బుకి ఆశపడి రామభజన చేస్తున్నాం అనుకున్నావా?

వంత 1 : మేం కిరాయి భక్తులం కాదు.

వంత 2 : మాకు హరిభజన వ్యాపారం కాదు.

కీ.కా : మేము పాడే పాటల్లో మాకు ఎంత విశ్వాసం ఉందో, మా ఆలోచనల్లో అంత నిజాయితీ వుంది. ఆత్మని మేల్కోల్పలేని, నిజం మాట్లాడే శక్తినివ్వని, అన్యాయిన్ని ఎదుర్కొని పోట్లాడలేని సిద్ధాంతం అంటే మాకు నమ్మకం లేదు.
రాములవారు అన్యాయాన్ని, అధర్మాన్ని, రాక్షసత్వాన్ని ఎదుర్కొన్నాడంటే – అటువంటి అన్యాయాలు జరిగిన చోట ప్రతి ఒక్కడూ రాముడై నిలవాలనే మా కోరిక.......అందుకే ఊరూరా మా సంచారం. నారదుడి వీణలో మాకు ఎంత విశ్వాసం ఉందో సుదర్శన చక్రంలో కూడా అంతే! ఇప్పుడు చెప్పు – ఆ పాపి ఎవరో.... మేం అందరం నీకు అండగా ఉన్నాం.......

శ్రోత 1 : నేను చెప్పలేను.....దీని వల్ల నేను, నా వాళ్ళు అనుభవించే యాతనలు మీకు తెలియదు.....దయచేసి యీ అపవిత్ర స్థలం నుంచి మాత్రం వెళ్ళిపొండి........ అంతే!

కీ.కా. : మేము వెళ్ళం.....మేము నోరు మూసుకుని వెళ్ళిపోతే యీ అత్యాచారాలు ఆగిపోతాయా? దీనిని ప్రశ్నించి అడ్డగించే వాళ్ళు లేకపోతే ఇటువంటివి ఇంకా ఎక్కువకావూ? ఇవ్వాళ మీరు అడ్డం పడకపోతే ఈ అత్యాచారాలు ఇట్లానే తరతరాలుగా సాగిపోవూ?

ఇదే జరిగితే మనం చేతకాని దద్దమ్మలంగా మిగిలిపోతాం – ఇప్పుడేకాదు. తరువాతి తరాలకు కూడా మనం పిరికి మందునే అందిస్తున్నాం అన్నమాట!

ఇటువంటి సంఘటనలలు జరిగేది ఈ వూళ్ళోనేనా?.....కాదు ప్రతిచోటా జరుగుతూనే వున్నాయి........మునుపొకసారి ఒక వూళ్ళో ఏం జరిగిందో ఓ కథ చెబుతాను.

**వంత1 :** ఎక్కడ? ఏ వూళ్ళో?

**వంత2 :** అక్కడేం జరిగింది?

**కీ.కా :** చెబుతాను.....కథా ప్రారంభానికి ముందు అందరూ గోవిందనామ స్మరణ చెయ్యండి....శ్రీమద్రమా రమణ గోవిందో హారి......

చాలా ఏళ్ళ క్రితం.....అలసి సొలసి వున్న పుడమితల్లి గుండెల మీది గాయంలా ఓ పురాతనమైన గ్రామం.........ఆ వూరి కథ చెబుతాను.....

కథ చెబుతానొక వూరిది
పాతకాలపు వూరది
కాకులు దూరని కారడవి
చీమలు దూరని చిట్టడవి
ఆ అడవి మాయాన ఉన్నది ॥కథ॥
ఉన్నవి రెండే వందల గడప
గడప గడపకో కన్నీటి గాథ
ఉలుకూ పలుకూ లేకుండా
పగలూ రాత్రీ పాటు బడే
బతుకు బరువును ఈడ్చడమే
అక్కడి మనుషుల జీవితం ॥కథ॥
అక్కడ పుట్టిన ప్రతి ప్రాణీ
మూగ, చెవుడు, గుడ్డి, అవిటి –
అదేమిటి?
రాతి గుండె కామందు మాటలకు
    బదులు చెప్పరాదు
    ఎదురు మాటలాడరాదు
రాతి గుండె కామందు చేతలను
    కనుల చూడరాదు
    చూచిన బదులు పలుకరాదు ॥కథ॥
రాతి పడవలా ఆ వూరు
ఎంతో తోసినా ముందుకు పోదు.
గందుకె ఆ వూళ్ళో

భయం భయం

ప్రియం ప్రియం

చావడమే ఇహ నయం నయం

నయం నయం ॥కథ॥

**వంత1 :** చుట్టూ దట్టమైన నిశ్శబ్దం ఏలుతున్న అడవి మధ్యలో ఉన్నదన్నమాట ఆ వూరు!

**కీ.కా :** అవును......అడవుల్లో పండే చింతపండు, కుంకుళ్ళు, దొరికే ఇప్ప పువ్వు, తేనె – వీటిని పోగుచేసి దగ్గరున్న ఊళ్ళలో అమ్ముకునే ఆది వాసులుండే వూరు.....రాను రాను ఆ అడవి చుట్టు పక్కల ప్రాంతాలన్నింటినీ తన కైవసం చేసుకున్నాడు ఆ వూరి పటేల్.....ఆ వూరికి దొర –

**వంత2 :** ఆ పటేల్ ఎటువంటి వాడు?

**కీ.కా :** ఆయన మాటల్లోనే విందాం –

(పటేల్ పాత్రధారి మీద కాంతి ప్రసరణం)

**పటేల్ :** నేనీ వూరి పటేల్‌ని.....మీ ముత్తాత 50 ఏళ్ళ కితం యీ వూరొచ్చి స్థిరపడి పోయాడు. అప్పట్నించీ ఈ వూరు మాదే! ఇక్కడున్న భూమి అంతా మాదే! కాని రైతులకు తలాకొంచెం కౌలుకు యిచ్చాం దున్నుకోమని......భూమి మాత్రం మా చేతుల్లోనే ఉందనుకోండి..అంతే కాదు.....ఈ చుట్టు పక్కల వున్న అడవుల మీద కూడా పెత్తనమంతా మాదే.....ఈ చెట్టు చేమల మీద ఏదో లాభాలు వస్తాయని కాదు సుమండీ! కాని పాపం!.....ఇక్కడున్న కూలీ జనానికి మేం పని యివ్వకపోతే వాళ్ళకి గుక్కెడు గంజినీళ్ళు దొరకడం ఎలా? ఇక్కడ అడవుల్లో దొరికే వస్తువుల్ని తెప్పించి, బాగు చేయించి పట్నానికి పంపుతాం.......ఈ రకంగా ఇక్కడి ప్రజల్ని ఆదుకుంటూ వాళ్ళని అవసరం వచ్చినప్పుడు పాతికో పరకో సహాయం చేస్తూ కాలక్షేపం చేస్తున్నాం.... పాపం! వాళ్ళంతా ఎవరు? మీ మోచేతి కింద నీళ్ళు తాగే జనమేగా? వాళ్ళని మేం కాకపోతే మరి సాయం చేసేవాళ్ళెవరు?
ఇందులో మాకూ కొంచెం...గిట్టు బాటవుతుందనుకోండి...అయినా...పూర్వకాలంలో ఉన్నట్టు ఉన్నారా ఈ అడవి మనుషులు? అబ్బో! అప్పుడయితే లాభాలే లాభాలు! ఇప్పుడు చాలా తెలివి మీరిపోతున్నారు....అయినా మేం చెప్పినట్టు వినక తప్పదు లెండి యీ వెధవలకి......

(కాంతి ప్రసారం భజన కారులమీదికి)

**కీ.కా :** ఆయనండీ పటేలు......ఇహ ఆయన కార్ఖానా వైపుకు పోదాం!

**వంత1 :** నిజానికి దాన్ని 'గోదాము' అనడం బావుంటుంది.

**వంత2 :** అక్కడ పగలూ, రాత్రీ అనకుండా 24 గంటలూ పని జరుగుతూ వుంటుంది. వస్తువుల్లోంచి చెత్తా చెదారం తీసి బాగు చెయ్యడం దాన్ని గోతాల్లోకి ఎత్తడం – ఇదే పని చేస్తూ ఉంటారు యీ వూరి కూలీలు.... ఇంకా బలం ఉన్నవాళ్ళు చెట్లు నరకడం, కలప కొయ్యడం, లారీలకు ఎత్తడం – ఇవీ వాళ్ళ పనులు.......

(కాంతి ప్రసారం కూలీ వాళ్ళ మీద అందరూ తలోపనీ చేసుకుపోతూ వుంటారు......)

ఒకడు : పని చెయ్‌రా భాయి పనిచెయ్‌రా

అందరూ : పని చెయ్‌రా భాయి పనిచెయ్‌రా

ఒకడు : పైసా కోసం

అందరూ : పని చెయ్‌రా

ఒకడు : పటేలు కోసం

అందరూ : పనిచెయ్‌రా

ఒకడు : లాఠీకోసం

అందరూ : పనిచెయ్‌రా

ఒకడు : దేశం కోసం

అందరూ : పనిచెయ్‌రా

ఒకడు : అమ్మ చెప్పెనూ

అందరూ : పనిచెయ్‌రా

ఒకడు : అయ్య చెప్పెను

అందరూ : పనిచెయ్‌రా

(పాట మెల్లగా కొనసాగుతూ వుంటుంది.....కూలీలు పనిచేస్తునే వున్నారు.......పటేల్, అతనితో పాటు గుమాస్తా వస్తారు.)

గుమాస్తా : చూశారా సార్! పని ఎంత బాగా నడుస్తోందో!

పటేల్ : ఆ! బద్ధకం యింకా వదలనట్టుగా వుంది వెధవలకి....ఇంకా తొందరగా జరగాలి పని...

గుమాస్తా : చిత్తం.....(కూలీలతో) ఏరా? ఒళ్ళు ఒంగదా? ఊపిరి లేనట్టు ఏమిటా చెయ్యడం? తొందరగా చెయ్యండి. (కూలీల పనిలో వేగం)

పటేల్ : ఆ! ఇప్పుడు బావుంది.
కలకత్తాలో సారపప్పు ధర ఏ మాత్రం పలుకతోంది?

గుమాస్తా : కిలో వందరూపాయలు సార్!

పటేల్ : మనకి ఏ మాత్రానికి గిట్టుబాటవుతోంది?

గుమాస్తా : పది రూపాయలు పడుతోంది సార్!

పటేల్ : బొంబాయిలో గోందు ధర ?

గుమాస్తా : కిలో పాతిక రూపాయలు సార్!

పటేల్ : మనకి?

గుమాస్తా : ఎంత సార్? రెండు రూపాయలు –

పటేల్ : మిగిలినవి?

గుమాస్తా : అన్నీ అంతే సార్! బంగారం పండుతోంది గదసార్!

పటేల్ : శభాష్! అట్లా వుండాలి! ఇట్లానే నడిపించు బండి.

గుమాస్తా : కాని ఆ ఫారెస్ట్ రేంజర్ – ?

**పటేల్ :** ఏ ఫరవాలేదు...వాడిప్పుడు ఖుషీ – వాడికో రొట్టె ముక్క విసిరేశాం.....అంతే పెంపుడు కుక్క –

**గుమాస్తా :** మరి ఆ ఇన్‌స్పెక్టర్ –

**పటేల్ :** వాడికో ఎముక ముక్క – పరమానందంగా ఉన్నాడనుకో.....ఇప్పుడు మన గులాము –

**గుమాస్తా :** కాని పట్నం నుంచి చదువుకున్న వెధవలొచ్చి –

**పటేల్ :** ఆ! వాళ్ళ సంగతి పోలీసులు చూసుకుంటారు....మన కూలీలు సంతోషంగా ఉన్నారా లేదా అన్నదే మనకు ముఖ్యం.

**గుమాస్తా :** ఆ సంగతి వేరే చెప్పాలా? చాలా సంతోషంగా ఉన్నారు......అంతెందుకు? మీరే అడిగి తెలుసుకోండి – ఒరేయ్ మిమ్మల్నే –

(కూలీలు వినయంగా పటేల్ వైపుకు తిరుగుతారు)

**పటేల్ :** మీరంతా హాయిగా ఉన్నారా?

**అంతా :** చిత్తం

**పటేల్ :** ఎవరికీ ఏ కష్టమూ లేదు కదా?

**అంతా :** చిత్తం

**పటేల్ :** కూడూ కుమ్మూ బావుందా?

**అంతా :** చిత్తం.

**పటేల్ :** మీరు ఏమన్నా చెప్పుకోవాలా?

**అంతా :** ఏం లేదు దొరా....

**పటేల్ :** చాలా సంతోషం.....అయితే, నేనన్నట్టు అనండి.....మేం హాయిగా వున్నాం

**అంతా :** మేం హాయిగా వున్నాం.

పటేల్ : మాకు కష్టాలు లేవు.

**అంతా :** మాకు కష్టాలు లేవు......

(పటేల్ కూలీలందర్నీ చూసుకుంటూ ఠీవిగా వెడుతూ మధ్యలో దుర్గవ్వ దగ్గర ఆగి, నఖశిఖ పర్యంతం చూస్తాడు)

**పటేల్ :** ఇది ఎవత్తెరా? కొత్తగా వచ్చిందా?

**గుమాస్తా :** రాములు పెళ్ళాం మల్లవ్వండయ్యా! మొన్ననే అత్తింటికి వచ్చింది...

**పటేల్ :** మన పనిలో పెట్టావా?

**గుమా :** చిత్తం –

**పటేల్ :** మరి – పని చెయ్యండ్రా.....ఏంది గుర్రాలాడుతున్నాయ్‌రా?

(కూలీలు పని చెయ్యడం మొదలు పెడతారు......)

పనిచెయ్‌రా భాయి పనిచెయ్‌రా
దేశం కోసం పనిచెయ్‌రా......

(ఫేడ్ అవుట్.......కాంతి ప్రసారం కీర్తనకారుడి మీద)

**కీ.కా** : అయ్యా! అదీ పటేలు సంగతి –

**వంత1** : యజమాని దయతో తలా రెండు బుక్కలూ దొరికేవి కూలీలకి.

**వంత2** : మనుషులు కనక, మానాన్ని దాచుకోవాలి కనక, ఓ రవ్వంత గుడ్డముక్క – ఒంటిని దాచుకోనేటంత గుడ్డముక్క దొరికేది అందరికీ. వాళ్ళకి అందరికీ –

**కీ.కా** : రూపాయి కూలీకి రోజంతా పనిచేసేవాడు దొరికితే పటేలు ఆనందానికి హద్దులుండేవి కాదు.

**వంత1** : అవును మరి! రోజుకు రూపాయి కూలిచ్చే వాడు మాత్రం ఎవడు దొరుకుతాడు? అందుకే కూలీలు సంబరపడి పోయేవారు!

**వంత2** : అందుకే మన పెద్దలు ఏమన్నారు? ఎంత డబ్బున్నా సంతోషం ముందు దిగదిడుపే నన్నారు.

**వంత1** : ఇంకా ఏమన్నారో తెలుసా? ఎండిన రొట్టో, బొట్టో ఇన్ని నీళ్ళు తాగి తొంగుండరా అన్నారు. అంతేకాదు. నెయ్యితో కాల్చిన రొట్టెలు చూసి వాటిని తినాలనుకోవడం అత్యాశరా – అన్నారు.

**వంత2** : అందుకే పెట్టింది తిని, నీళ్ళుతాగి కడుపు నింపు కొనే యీ అభాగ్య జీవులకి ఆ యజమాని దేవుడి లాంటి వాడని నమ్మకం –

**వంత1** : కడుపు నింపు కోవడానికి ఓ రొట్టె ముక్క, మానం కప్పుకోవడానికి గోచీ ముక్క, నోటినిండా పలికే హరి నామ స్మరణ – ఇంతకన్నా యీ పుణ్యభూమిలో, యీ కర్మభూమిలో పుట్టిన వాళ్ళకి ఇంకేం కావాలి?

**కీ.కా** : అయితే – వాళ్ళ బాధల న్నింటినీ ఆటపాటల్లో మరిచిపోతారు.

(కూలీల ఆటపాటల మీద కాంతి ప్రసారం)

సంకూరేతిరి ఒచ్చె
సంతాకు పోగాకు
సక్కాని సుక్కా
నా సిన్నీ గైరమ్మ
సద్దీ కట్టూకోనీ
సక్కంగా బయలెల్లె
సక్కాని సుక్కా
నా సిన్నీ గైరమ్మా॥
ముక్కూకు ముక్కెర తేర
కంటే పేరులు తేర
కంటే పేరూలు తెచ్చి
కాళ్ళకు గజ్జెలు తేర – ॥
ముక్కూకు ముక్కెర తెస్తా
కంటే పేరూలూ తెస్తా

కంటే పేరూలూ తెచ్చి
కాళ్ళకు గజ్జెలు తెస్తా ॥సక్కాని సుక్కా నా సిన్నీ గైరమ్మా॥
సన్నా బియ్యం కూడు
రంజైన రొయ్యల పులుసు
ఊరేసిన ఉప్పూసేప
సద్దీలో కట్టుకుపోదాం
సక్కాని సుక్కా
నా సిన్నీ గైరమ్మా॥

(పాట మీద ఫేడ్ అవుట్....కీర్తన కారుల మీద కాంతి ప్రసారం)

**కీ.కా** : ఈ విధంగా ఈ పరిస్థితుల్లో ఎటువంటి మార్పు రాకూడదని అనుకుంటున్నాడు.

**వంత2** : వాళ్ళు సుఖంగా ఉన్నారంటే వాళ్ళ పూర్వజన్మ సుకృతమేనంటాడు

**కీ.కా** : ఆ మాట వాళ్ళమీద మత్తుమందులా పనిచేసింది.......అందుకే మధ్య మధ్యలో హరినామస్మరణ చేయిస్తాడు.....శ్రీశ్రీశ్రీ అఖండానంద స్వాములవారు అక్కడికి రావడం ఇది 108వ సారి......

(ఫేడ్ ఇన్...... పటేల్ మీదికి)

**పటేల్** : స్వామీ! మీ రాక వల్ల మా ఊరంతా తరించింది. మీలాంటి వారు మమ్మల్ని కరుణించడం మా అదృష్టం.....అష్టసిద్ధులన్నీ మీ ఎదుట చేతులు జోడించి నిలబడ్డాయంటే ఆశ్చర్యం ఏముంది? అలా....అలా.... మీరు చేతులోంచి వీభూతి రాలిస్తే చాలు – నిస్సంతులు సంతాన వతులౌతారు. అంతేనా? భయంకరమైన ఏ వ్యాధినయినా మీరు నయం చెయ్యగలరు....మా పుణ్యం పండడం వల్ల మీరు వీళ్ళందరికీ దర్శనం ఇవ్వడానికి విచ్చేసారు....వీళ్ళకి మీరు స్వర్గ, నరకాలు ఎలా చుట్టి వచ్చిందీ వివరించండి స్వామీ! (కూలీలతో) ఇవాళ మనకి పండగరోజు....శ్రీశ్రీశ్రీ అఖండానంద స్వాముల వారు మన మధ్యకు రావడమే మహత్తరమైన విషయం ఆయన్ను గురించి చెప్పడం సూర్యుడికి దివిటీ చూపించినట్టే....ఎప్పుడు కావాలనుకున్నా అప్పుడు అయన స్వర్గనరకాలనుంచి ఆత్మలను పిలిచి వాటితో మాట్లాడగల మహిమ ఉన్నవారు.....గొడ్రాళ్ళకు పిల్లలనివ్వగలరు. నీళ్ళ మీదనే నడవగలరు....అన్నట్టు ఆయన యీ మధ్యనే స్వర్గ నరకాలు రెండూ దర్శించి అక్కడ నుంచి పటాలు తెచ్చారు...ఇపుపడు వారు తమ అమూల్యమైన బోధలు మనకు వినిపిస్తారు. ఏదీ అందరూ అనండి – అఖండానందస్వాముల వారికీ జై –

**అఖండానందస్వామి** :

ఓమ్ భూర్భువస్సువ: ఓం తత్స వితుర్ వరేన్యాం భర్గోదేవస్య ధీమహి
ధీయో యోన: ప్రభోదయాత్ –
కర్మణ్యేవాధికారిస్తే మాఫలేషు కదాచన –
గురుర్ బ్రహ్మా గురుర్ విష్ణు గురుదేవో మహి
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మయ్‌శ్రీగురవేనమ:

(కొంతసేపటి దాకా ఇలానే అసంబద్ధమైన శ్లోకాలు చదువుతూ, తరువాత)

చంచలమైన మనస్సు నువ్వు-నేను అనే భావనను విడిచిపెట్టనంత వరకు మనకు ముక్తి లేదు...విత్తొకటి చెట్టొకటి కాదు.....నువ్వు-నేను వేరుకాదు...ఉమ్మెత్త విత్తు వేసి మామిడికాయలు కావాలంటే మాత్రం ఎక్కడనుంచి వస్తాయి?.....చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ......ఇప్పుడీ పటేల్‌ను చూడండి....పూర్వ జన్మలో ఈయన ఒక జమిందార్ ఇంట్లో నౌకరు. కాని ఒళ్ళోంచి పనిచేశాడు. ఈ జన్మలో పటేల్ అయ్యాడు. దీనికి కారణం ఆయన పూర్వజన్మలో చూపిన స్వామిభక్తే నన్న మాట!...అందుకని నాయనలారా! అట్టహాసంగా బతికినా అట్టడుగున ఉన్నా అదంతా పూర్వజన్మ సుకృతమే! మీరీ మాట నమ్మకపోతే పోనీ, నేను స్వర్గ నరకాల నుంచీ తెచ్చిన ఫోటోలు చూపిస్తాను.......చూడండి.......దీని పేరు "స్వామి భక్తికి ప్రతిఫలము"

(ఫోటో మీద లైట్)

ఆహాహా! చూడండి.....ఓ రాజు...దర్పంగా........వయ్యారంగా అతనికో యువతి సోమరసం తాగిస్తోంది..... నృత్యం, సంగీతం......(సంగీత, నృత్యాల కోలాహలం) చూశారా! ఇది స్వామిభక్తికి తగిన ఫలితమన్నమాట!

ఇప్పుడు నరకం ఫోటో చూడండి......అర్ధనగ్నంగా పడివున్న ఈ మనిషి.....ఒంటినించి రక్తం కారుతోంది...యమదూతలు అతన్ని చితక పొడుస్తున్నారు......చూశారా! ఇది స్వామి ద్రోహానికి ఫలితం....నరకయాతన అంటే యిదే! అందువల్ల మీ యజమానిని భయభక్తులతో సేవిస్తే వచ్చే జన్మలో సర్వసుఖాలు అనుభవిస్తారు...యజమానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే నరకయాతనలు పడపడవలసి వుంటుంది.

(స్టేజి మీద చీకటి.....ఒకదాని తరువాత ఒకటిగా)

ఇప్పుడు మీకు తెలిసింది కదా - చేసుకున్నవారికి చేసుకున్నంత - అని యజమాని చెప్పింది చేసి పెట్టింది తిని పనిచేస్తే వచ్చే జన్మలోనన్నా దానికి తగిన ఫలితం అనుభవిస్తారు....ఏవీ ఒక్కసారి భగవన్నామ స్మరణ చెయ్యండి......ఇందిరారమణ గోవిందో హారి.........

పటేల్ : ధన్యులం స్వామీ, ధన్యులం.......స్వామీ! నాదో చిన్న విన్నపం.

స్వామి : (నవ్వి) చెప్పు పటేల్, చెప్పు.

పటేల్ : మీరు ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు స్వర్గనరక యాత్రలు చేసిరాగలరు. మీరు అనుగ్రహిస్తే ఈ స్వర్గనరకాల ఫోటోల్ని మా గోదాములో పెడదామని...వీటిని చూస్తూ మాకూ వీలు మీరు చెప్పిన సందేశాన్ని మరిచిపోకుండ వుంటారు.

స్వామి : బాగానే వుంది కానీ, చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత - అని చెప్పాం కదా!.......అయినా మీరంతా ఎలా అంటే అలానే - మేము కొత్త ఫోటోలు తెచ్చుకుంటాం....ఇవి మీరు మీ గోదాములో అంటించుకోండి.

పటేల్ : కృతజ్ఞులం స్వామీ!
పదండిరా! వీటిని గోదాములో చక్కగా అంటించండి.

(కూలీలంతా మాట్లాడుకుంటూ గోదాములో ఫోటోలు అంటిస్తూ వుంటారు.....పటేల్, అఖండానంద స్వామి వెళ్ళిపోతారు.)

(కీర్తనకారుడు, వంతు ప్రవేశం....)

**కీ.కా** : భక్తులారా! ఈ ప్రకారంగా స్వర్గనరకాల ఫోటోలకు గోదాం గోడలమీద అంటించారు కూలీలు.

**వంత1** : కూలివాళ్ళు భయంగానూ, ఆశగానూ ఆఫోటోల వంక చూస్తూ వుండిపోయారు.

**వంత2** : కొందరి కళ్ళల్లో భయం.....

**వంత1** : మరికొందరు కళ్ళల్లో వచ్చే జన్మలోనైనా స్వర్గసుఖాలు అనుభవించవచ్చునన్న ఆశ.......

**కీ.కా** : ఈ విధంగా కూలీల మనసుల మీద చెరగని ముద్ర వేశాడు పటేల్. ఆయన పంజాలోంచి యిక వాళ్ళకి విముక్తి లేదు. కూలీలు నయానా, భయానా పనిచేస్తూ ఆయన వ్యాపారాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నారు. ఇప్పుడు వాళ్ళకి తల్లీ, తండ్రి పటేలే!

త్వమేవ మాతాచ, పితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ, సఖాత్వమేవ
త్వమేవ విద్యాం, ద్రవిక్షాం త్వమేవ
త్వమేమ సర్వం, మమదేవ దేవ........

**వంత1** : నువ్వే మా సర్వస్వం!

**వంత2** : నువ్వే మా దేవుడివి!

**కీ.కా** : అంటే పూర్వం కంటే ఇప్పుడు పనియింకా బాగా చురుకుగా నడుస్తోందన్నమాట!

**కూలీ** : పనిచెయ్యండిరా......పనిచెయ్యండి.......

**అందరూ** :

పనిచెయ్‌రా భాయ్.....పనిచెయ్‌రా
పైసాకోసం పనిచెయ్‌రా
పటేలు కోసం పనిచెయ్‌రా
స్వర్గంకోసం పనిచెయ్‌రా
నరకం కోసం పనిచెయ్‌రా
దేశం పేరు నిలపండ్రా
పటేలు కోసం పనిచెయ్‌రా
పనిచెయ్‌రా భాయి పనిచెయ్‌రా.........॥

**కీ.కా** : అట్లా పనులు చేసుకుంటూ పోతున్న ఆ కూలీల మధ్య ఒక రోజున ఏం జరిగిందంటే –

**వంత1** : రాములు పెళ్ళాం మల్లమ్మ పుట్టింటికెళ్ళి తిరిగొచ్చింది.

**వంత2** : ఆవిడది అడవి అవతల వున్న ఓ చిన్నపాటి పట్నం.

**వంత1** : అక్కడుండో బజారు.

**వంత2** : ఆ బజారులో కొన్ని వందల కాగితాలు పడేసి ఉన్నాయి.

వంత1 : ఆ కాగితాల్లో ఒకదాన్ని ఈ వూరు తెచ్చింది మల్లమ్మ.

వంత2 : దాని మీదేదో రాసివుంది.

వంత1 : ఏవో గురులు కూడా ఉన్నాయి.

కూలీ : అదుగో! మల్లమ్మ ఒచ్చిందే!

వంత2 : కూలీలంతా ఆ రంగురంగుల కాగితాన్ని దొరక పుచ్చుకున్నారు.

వంత1 : చిక్కిరి బిక్కిరిగా వున్న కాగితాన్ని చూసి –

వంత2 : ఓ కూలీ రాములు పెళ్ళాన్ని అడిగాడు:

కూలీ1 : ఏంది మల్లమ్మా! ఏవో తెచ్చినావే!

మల్లమ్మ : నాకేటెరిక? పట్టనంలో రోడ్డుమీద అడేసున్నాయి అట్టుకొచ్చిన.....మంచి గున్నాయిలె?

కూలీ2 : దీనిమీద ఏం రాసుందే?

మల్లమ్మ : నాకేం ఎరుక? రోడ్డుమీద కుప్పంగ పడుంటే దెచ్చిన....పోనీ పారేయనా?

కూలీ3 : పారేస్తావా? ఎందుకే? ఎట్టగుడ తెచ్చినవ్ గదె? ఇండ్ల ఒక్కదాన్ని గోడకు అటక బెడితే?

కూలీ4 : దానవ్వ.......పటేలు గూడ ఖుషీ అయితాడు....అంటిద్దాం యేం......

రాము : అరే! జరనిలబడరాదు?.....నీ యవ్వ.....పటేల్‌కి కోపం రాదు గంద?

కూలీ2 : వస్తే గప్పుడే తీద్దాంలే –

కూలీ3 : కోపం ఎందుకొస్తది? మొన్న పటాన్ని అతక బెట్టమని ఉకసాయించింది ఆయనే గందా?

కూలీ1 : అయితే చక్కంగ అతక బెడదాం.

కూలీ2 : ఏడ?

కూలీ3 : గీడనయితే –

రాము : గాడగాదురా........ఆ గోడకి అతక బెడదాం.....ఆ సొరగం, నరకం తస్వీర్ల నడుమ అంటబెడితే మంచిగుంటది.

కూలీ2 : నీ యవ్వ...పటేలయ్యొచ్చి మనల్ని ఏం తారీపు జేస్తాడు జూడు!

కూలీ1 : ఆడ అతకబెట్టు!.....ఆ! ఆయన సూపు సక్కంగా దాని మీదనె పదతది.....అప్పుడాయన ముఖం సూడాల.....ఒరే! మనందరికి గింతింత పొగాకిస్తడులే!

రాము : అరే! యీ కాయితం మీన ఏం రాసుందిరా?

కూలీ3 : అది సదవస్తే గీడెందుకు కొలువుజేస్తుండా.......దరోగాలయ్యేటోళ్ళం గాదరా!

కూలీ2 : దాని మీద ఏ రాములోరి పేరో రోసుంటది.......ఆయనే సదువు కుంటడు దియ్.........

కీ.కా : ఈ విధంగా ఆ కూలీలు నవ్వుతూ తుళ్ళుతూ ఓ పెద్ద పోస్టర్ గోదాం గోడమీద అంటించారు.....

వంత1 : కాసేపటికల్లా పటేల్ గుమాస్తా వచ్చాడు.....కాస్త చదువుకున్నవాడేమో, ఆ పోస్టర్ చూసి ఒకటే పరుగు......

వంత2 : నిజానికి మిగిలిన కూలీల చేత పనిచేయించాలని పరిగెత్తాడు...

గుమాస్తా : పని చెయ్యండ్రా........తొందరగా......

అందరూ :

పనిచెయ్‌రా భాయ్‌ పనిచెయ్‌రా.....

కాయితం చెప్పింది పనిచెయ్‌రా.....

(ఈ పాట పైస్థాయిలో ఉండగా పటేల్‌ వస్తాడు....ముందు సంతోషిస్తాడు. ఇంతలో పోస్టర్‌ చూసి ఉగ్రుడవుతాడు.)

**పటేల్‌ :** ఎవరంటించారీ కాగితం?.....(జవాబు లేదు).....ఈ పోస్టర్‌ ఎవరంటించారు...మాట్లాడరేం? ....మిమ్మల్నే!.....ఇది అంటించేంత ధైర్యం ఎవడిదిరా?....చెప్పండి....ఎవరిదీ పని?

(కూలీలు మొహ మొహాలు చూసుకున్నారు....పటేల్‌కి ఎందుకింత కోపం వచ్చిందో వాళ్ళకు అంతుపట్టలేదు)

చెప్పండ్రా మూగవెధవల్లారా? – ఏ గాడిద కొడుకు అంటించాడు దీన్ని? చెప్పకపోతే చెమడాలెక్క దీస్తాను... పోస్టర్లంటిస్తార్రా మీరు? – నీ యవ్వ......అసలు మిమ్మల్ని ఎక్కేసిందెవర్రా?....చెప్పండిరా – ఎవడువాడు? వాడి పేరేమిటి?

(అందరూ కూలీలు యీ తిట్ల జడివాన చేష్టలుడిడి పోతారు. పనిచేసేవాళ్ళు కాస్తా కూలబడతారు)

**పటేల్‌ :** అయితే ఎవరూ చెప్పరన్నమాట! పట్నంనించి ఈ ఎదవ కాగితాలని తెచ్చిందెవరు? ఎవడ్రా మీ నాయకుడు?...ఒరేయ్‌! ఈ ఊళ్ళో నేను చెప్పిందే వేదం. నేను చెప్పిన మాటే నెగ్గితీరాలి...నా మూత్రంతో దీపాలు వెలిగించుకునే వెధవలు, మీకు ఎన్ని గుండెల్రా? పెద్ద పెద్ద ఆఫీసర్లు నేను పోసే తాగుడు తాగుతారు. నాయకులంతా నా దగ్గర చందాలు పట్టుకుపోతారు...మీరు..మీరు – ఈ పని చేసిందెవరో తెలిస్తే గొయ్యి తీసి పాతేస్తాను. జైల్లో తోయిస్తాను...ఎవడ్రా యూనియన్‌ పెట్టేవాడు? చెప్పండ్రా కుక్కల్లారా? ఎవడ్రా?

(కూలీలు చాలా భయపడి పోయారు...మాట్లాడే స్థితిలో కూడా లేరు)

**పటేల్‌ :** నాకు తెలుసు. ఆ చదువుకున్న పట్నం వెధవలు మన వూరికే వచ్చారన్నమాట!...ఎవడన్నా ఆ వెధవలతో పొత్తు కలిపినట్టు తెలిసిందా – అరే! కూలి ఎక్కువ కావాలంటే నన్నడగాలి. ధరలు పెరుగుతున్నాయని నాకు మాత్రం తెలియదూ?...మీ కొక్కళ్ళకేనా ధరలు పెరిగేది? వస్తువులన్నీ ప్రియమైపోయాయి....ఇంపోర్టెడ్‌ విస్కీ పెరిగింది...హోటల్‌ కిరాయి పెరిగింది....ధరలు ఎక్కువైతే మా నడ్డిమాత్రం విరగదూ?

(ఫ్రీజ్‌)

**కీ.కా :** అదండీ పోస్టర్‌ ప్రభావం. దాన్ని చదువుకుని పటేల్‌ మండి పడుతున్నాడు.

**వంత1 :** కాని తమ యజమాని ఎందుకంత కోపంగా వున్నాడో కూలీలకు తెలియడంలేదు.

**వంత2 :** వాళ్ళు. సరదాకి స్వర్గనరకాల ఫోటోలల మధ్య యీ పోస్టర్‌ అంటించారు.

**వంత1 :** దీన్నే విధివిధానం అంటారు.

**వంత2 :** కూలీలు భయపడిపోతున్నారంటే అవి ఆత్మరక్షణ కోసం వాళ్ళు చేసే ఆలోచనే!

**వంత1 :** అంతేగాని, అది సత్యాగ్రహం మటుకు కాదు.

వంత2 : కాకపోయినా పటేల్ మాత్రం దీన్ని నిశ్శబ్ద సత్యాగ్రహం అనుకున్నాడు.

వంత1 : ఇది తమ కోర్కెలను తీర్చుకోవడానికి కూలీల ప్రయత్నం అని కూడా ఆయన అనుకున్నాడు.

కీ.కా : ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎవరూ ఏమీ మాట్లాడకపోయేసరికి పటేల్ మెత్తబడ్డాడు.

పటేల్ : మీరు తల బద్దలు కొట్టుకున్నా సరే, నేను రోజుకు నాలుగు రూపాయలే కూలీ ఇవ్వలేను..నాలుగు రూపాలయలు మీకిస్తే నేనేం తింటాను? ఇనకంటాక్స్, సేల్స్‌టాక్స్; పార్టీలకీ చందాలు, ఆఫీసర్లకి లంచాలు – ఇవన్నీ మీ అబ్బ యిస్తాడా? అరె! మార్కెట్ ఎంత డల్‌గా వుందో తెలుసా? సరుకేమన్నా అమ్ముడు పోతోందా అసలు? ఇప్పుడు నాలుగు రూపాలయల కూలీ కావాలని మీ పోస్టరేమిటి? నిజమే! వస్తువులన్నీ ప్రియం అయిపోయాయి..కాని నేను మాత్రం ఆరణా కన్న ఎక్కువ పెంచలేను...ఆ తరువాత మీ ఇష్టం......ఒరే! దాంతో పాటు ఆ నాయకుణ్ణి వెంటనే ఊరు వదిలిపెట్టి వెళ్ళిపొమ్మని చెప్పాలి...లేకపోతే నా అంత దుర్మార్గుడు ఉండడు. తెలిసిందా?

(పటేల్ వెడతాడు. ఆయన వెనకనే గుమాస్తా......కూలీలు మెల్లగా లేస్తారు.....ఆ పోస్టర్ దగ్గరకి వెడతారు.... దాన్ని తాకి నమస్కారం చేస్తారు)

...............

కూలీ1 : మల్లవ్వా! నీ కాయితం మీన ఏదో జాదూ గిట్ట ఉండాలినే?

మల్లవ్వ: నాకేమెరికె? పట్నంలో రాస్తాల పడివుంటె దెచ్చిన – మంచిగున్నాయిగదాని.....

కూలీ2 : దీన్ల కూలీ బడాయించమని ఉందిగావచ్చు!

కూలీ3 : మరి పటేల్ అయ్య్ను గది చూసే బయపడతన్నడంటావా?

కూలీ4 : అందుకే నాయాల్తి అంత గరమయిందు. అందుకే మల్ల గట్ల ఒరల పట్టిండి.

కూలీ1 : ఈ నాయకుడెవడ్రా? ఇ నాయకుడు!

రాము : నాకు మాత్ర మేమెరికె? ఎవరో ఏమో!

కూలీ2 : ఈ కాయితంల సొరగం నరకం సంగతి కలిపిరాసుండాల! ఒకపక్క ఆరణా కూలీ పెంచుతానని ఒట్టె, ఇంకో పక్క మూడ్రోజుల్ల మట్టి తిట్టె ఉండె!

కూలీ3 : మనం అడగకనే బోతిమి! మల్ల ఆటణా ఎందుకు పెంచినట్టు పటేలు?

కూలీ2 : గింద్ల ఏదో మతలబు ఉందరే రాములు!

రాము : మల్లమ్మా! నీకా కాయితం ఏడ దొరికిందే?

మల్లమ్మ : జెప్పలే! మా పట్నం రోడ్డు మీద దొరికింది.

రాము : దీన్ని ఓల్‌తోనన్నా చదివించుకోవాల్‌రా.....ఆటణా కూలీ పటేల్ పుటుక్కున పెంచుతాడ్‌రా? ఎందుకు పెంచిండో తెలియాల్నంటే సదివించుకోవాల్నిగా!

కూలీ1 : కాని సదివేటోడెవరు? మన మందిల సదవనికి ఓలుకొస్తది?

రాము : ఆ! నే బోయి పంతుల్ని దోలుకొస్తా......ఆయన యియరంగా సదివి సెపుతాడు......

కూలీ2 : ఔ మల్లా! మంచిగ చెప్పినావ్!

కూలీ3 : ఎల్లు. ఎల్లి పంతుల్ని జరజల్దీ తోలుకురా!

కీ.కా : రాములు గురువుగారిని పిలుచుకురావడానికి వెళ్ళాడు....సంగతి చెప్పేవుంటాడు....సరే! అతను

వచ్చే వరకు మనమేం చేద్దాం?

**వంత1 :** కూలీవాళ్ళు తాము సాధించిన మొదటి విజయానికి పండగ చేసుకుంటున్నారు.....ఆ పండగ చూద్దాం –

(బృంద నృత్యం......పాట..........)

పైసా వచ్చిందీ
పండగ తెచ్చిందీ
పండగ తెచ్చె
మా యింట సంబరాలె ॥ఓహో సంబరాలె॥
బుక్కెడు కూడు
గుక్కెడు నీళ్ళు
కాలేకడుపుకు కసింత గంజి॥
పండగ ఒచ్చిందీ
పైసా తెచ్చిందీ
పైసా ఒచ్చి మా యింట పండగ తెచ్చింది॥

**పంతు :** ఏమిటి రాములూ! చాలా సంతోషంగా ఉన్నావే! ఏమిటి సంగతి?

**రాము :** సంగతేందో ఆనక జెబుతా.....జల్దీ రావాలి పంతులుగోరు చాలా జరూరు పనుంది.....

**పంతు :** ఏమిటోయ్ అంత జరూరు?

**రాము :** ముందు గోదాముకి పోయి, కాయితం సదవాల

**పంతు :** ఏం కాయితం?

**రాము :** మీరే సూద్దురు – జల్దీ రండి పంతులూ!

**పంతు :** సరే, పద!

(ఇద్దరూ వస్తారు)

**కూలీ1 :** అద్గో! పంతులాయన ఒచ్చేసిండు

**అందరూ :** దణ్ణాలయ్యో!.......దణ్ణాలు......

**రాము :** గీ కాకితంల ఏముందో జర సదివి సెప్పుండ్రి పంతులూ!

**పంతు :** (మొదటి కాయితం దగ్గరికి పోయి) ఇదేదో స్వర్గం అని రాశారు!

**రాము :** అది కాదు పంతులయ్యా! గీ కాకితంల –

**పంతు :** (గాభరాగా) అయ్యో! ఈ పాము పిల్లని ఎవరయ్యా ఇక్కడికి తెచ్చింది?....ఇది చాలా ప్రమాదం.... దీన్నిక్కడ అంటించిందెవరు?

**రాము :** గండ్ల ఏముంది పంతులూ?

**పంతు :** ఏముందా? కొంపకు అంటించే నిప్పుంది.

**అందరూ :** అమ్మో!.......ఓలమ్మో

పంతు : దీన్ని అంటించిందెవరు?

కూలీ1 : మేమే అతక బెట్టినం పంతులూ! మల్లవ్వ పట్నం కెల్లి తెచ్చింది.....

రాము : గిప్పుడు సెప్పుండ్రి, అండ్ల ఏం రాసుందో -

పంతు : మజ్దూర్ యూనియన్ జిందాబాద్....కార్మికుల ఐక్యత వర్థిల్లాలి -

కూలీ2 : గంటె? ఏందది?

పంతు : ఆగు చెబుతా ఇంకా వుంది...మా కోర్కెలు చెల్లించండి.....కూలీ నాలుగు రూపాయలకు పెంచండి....లేకపోతే పరిణామాలు భయంకరంగా ఉంటాయి - అని కూడా రాసుంది.

కూలీ3 : గంటే. అవేంది?

పంతు : ఏమో కాని బెదిరింపు మాత్రం దండిగా ఉంది. ఈ గుర్తు కలిసివుండడానికి చిహ్నం....పటేల్ని భయపెట్టడానికి యిది చాలు....

కూలీ1 : గయితే పటేలు బయపడ్డ దన్నట్టు!

కూలీ2 : నీ యవ్వ! గాయన గూడ బయపడతాడ్రా!

రాము : గీ కాయితం లెక్కన -

పంతు : కాయితం కాదు, పోస్టర్, పోస్టర్ -

రాము : ఏందీ? పోష్ట్రా? అదే - పోష్ట్ర లెక్కన మేమూ దినానికి నాల్రూపాయల్ కూలి అడగొచ్చన్నట్టు!

కూలీ3 : గంటే! ఆయనకంత లాబం ఒస్తున్నదన్నమాటేనా పంతులా?

అందరూ : కూలీ నాల్రూపాయలన్నట్టు!

పంతు : చూడు. అధిక ప్రసంగం చెయ్యకు...నేను చదివానని పటేల్కి తెలిస్తే తెల్లారేసరికి నాకు బదిలీ చేయిస్తాడు. ఏవో లేనిపోని నేరాలు మోపి నా ఉద్యోగానికి ఉద్వాసన చెప్పిస్తాడు....నేను చదివినట్టు ఆయనకు చెప్పకండి.......

(కాసేపు నిశ్శబ్దం)

రాము : అరే! మనం గిసుమంటివే యింకొన్ని కాయితాలతక బెడితే?

కూలీ1 : ఎందుకు?

రాము : గిప్పటికే పటేలు బయపడబట్టిండు...గింకింత బయపడితే కూలీ యింకింత ఎక్కువ జేస్తాడు...

కూలీ2 : మరి గంతాశ పనికి రాదురా!

కూలీ3 : మల్లా అడిగితే మనల సంపుకతింటడు.

కూలీ4 : గంతేనా? మల్ల పనిల్నోంచి నికలాయిస్తడు కూడ.

కూలీ1 : ఒరే! పానాలు దీస్తాడురో పటేలయ్య!

కూలీ2 : మన గుడిసెలు తగలెట్టిస్తడు.

రాము : గట్ల జెయ్యజాలడు పటేలు....బయపడిపోయిండు సూడలే! గిదే మాంచి మౌకా - కూలీ బడాయించమని అడిగేటందుకు!

కూలీ3 : గట్ల అడిగితే బయటపడతాడ్రా?

కూలీ1 : అరె! తిండిగింజలు గూడివ్వకుండ మాడబెడతాడు.

రాము : అట్ట జేసేటోడయితే మనం అడక్కుండానే ఆఠణా ఎందుకు బెంచుతాడ్రా? ..మన మేమన్నా కాని పని కడుగుతున్నాంర - ? పని జేస్తలే? - పైసలడుగుతున్నం.....మనకేం బేకారికిస్తడు?

(మౌనం)

రాము : సెప్పండ్రి.......గాయన బయపడే యిసయం యీ కాయితంల ఉన్నదన్నట్టు.......బయపడిండు, ఆటణా యెక్కువజేసిండు.....మరి ఆల్లేమో నాల్రూపాయలడగ బెడితిరి? ఒక కాయితంకి బయపడి ఆఠణా బెంచినాడు గింకో కాయితం రాస్తే గింకో ఆటణా బెంచడ్రా?.......ఏంది సప్పుడు జెయ్యరు?

కూలీ 1 : అరె! గా కాయితం జూడగానె ఆఠణా బెంచిదు గాదుర?

రాము : అంటె, గా కాయిత రాసినోల్లకి దిమాక్ లేదనా నువ్ జెప్పుదు? గాల్లెందు కడిగింద్రట నాల్రూపాయలు?

కూలీ 3 : నీలల్ల ఉండుకుంటు మొసల్తో నిరోదం ఎందుకు రాములు?

కూలీ 1 : ఇప్పటిదనక బుక్కెడు బువ్వదిని బతుకుతున్నం. ఇగమీదన అది కూడ ఉండదు.

రాము : ఎందుకుండదు? ఒట్టె పున్నానికి స్తుండాకూలి? మనల్ని బాదలు పెడితే గీ కాయితం ఎవలు రాసింద్రో గనుక్కుని ఆల్లకే జెప్పుకుందాం మల్ల.....ఏంది? మనం గాపాటి దైర్యం జెయ్యలేమారా? గంత సచ్చున్నమా?

కూలీ 1 : ఇటు జూడు రాములన్నా! అగ్గితో టైరమెందుకురా?

కూలీ 2 : మా పెళ్ళాం బిడ్డలకి కూడు గూడా లేకుండా జేస్తావురా?

కూలీ 3 : నసీబ్‌ల ఏదుంటే గజ్జరుగుతాది....దాన్నె వరు మారుస్తార్ర?

రాము : ఏం? గెందుకు మార్చలేం?

కూలీ 3 : కోరి కట్టాలు తెచ్చుకుంటవుర?

రాము : ఇందులో కట్టమేందిరా? నేను పంతులయ్య నడిగి గిసుమంటి కాయితాలు యింకిన్ని రాయించుకొస్త....ఆటిని ఇప్పటి లెక్కనే అతక బెడదాం...గాయన కాగితం జూసి బయపడితే మనందరికి ఫాయిదేగదర?

కూలీ 1 : అట్లగాకుండ, ఇంకేదన్న అయితే -

రాము : గంతకొస్తే కాయితాలు నేనే అతక బెట్టినాని జెబుతా..తియ్.....సంపితే నన్ను సంపుతాడు...ఏదన్న నుక్సానయితే నా కయితది....మీరు సప్పుడు సెయ్యుండ సూస్తు కూసోండ్రి.....

కూలీ 2 : ఏమన్నాయితే మాత్రం నీదే జమీదారి రామన్నా! సరేనా?

కూలీ 3 : నోటి కాడి కూడు బోకుండా జూడు....

రాము : మీరేం పికరు పడకండి.....ఆయనేమన్న మీరు సప్పుడు సెయ్‌కుండ్రి......నేను పంతులయ్య కాడికి బోయి కాయితాలు రాయించుకొత్త......మీరింటికి బోండి.....(వెడుతూ తిరిగివచ్చి) అరే! గుమాస్తా వచ్చేతనికి ముందే మనం మన పని జేసుకుబోవాలె.....మీ పని మొదలెట్టుండ్రి.........(రాములు వెడతాడు)

అందరూ పాడతారు:

పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా

పైసా కోసం పనిచెయ్‌రా
పటేలన్నడు పనిచెయ్‌రా
పట్వారన్నడు పనిచెయ్‌రా
కాయితమన్నదది పనిచెయ్‌రా

(రాములు పంతులుగారి దగ్గరికి వస్తాడు)

**పంతు :** ఏమిటి ఆలోచిస్తున్నావు రాములూ?

**రాము :** గిదంతా కలలెక్కనుంది పంతులూ!

**పంతు :** ఏది?

**రాము :** ఇదే! మనం రాయని కాయతన్కి పటేలెందుకింత బయంపడ్డడూ అని?

**పంతు :** తన నీడని చూసి తనే భయపడ్డాడు...తాడును చూసి పామనుకోవడం అంటే ఇదే! పోయిన వారం ఈ చుట్టుపక్కల ఇద్దరు ముగ్గురు పటేళ్ళని చావచిదక బాదారు....దాంతో బేజారయిపోయుంటాడు పటేల్.

**రాము :** ఇంతకీ ఆల్లని కొట్టిందెవరు పంతులుగారూ?

**పంతు :** మనకేం తెలుసు? పోలీసులు ఆచూకీ తీస్తున్నారుట! ఆ పటేళ్ళు ఎంత చెడ్డవాళ్ళంటే, పోలీసులు, రైతులు, కూలీలు – అంతా సంతోషిస్తున్నార్ట!

**రాము :** (కొంచెంసేపాగి) పంతులూ! మేం గిసుమంటివే ఇంకొన్ని కాయితాన్ని అతక బెడదామనుకుంటున్నం.

**పంతు :** ఎందుకు?

**రాము :** ఆ కాయితంల నా(లూపయలడిం(దని రాసుందిగా? మేం ఇంకా కాయితాల అతక బెడితే పటేల్ ఇంకా దడుస్తాడు....మా కూలీ యింకంత బెంచుతాడేమోనని –

**పంతు :** ఏమో – పెంచనూ వచ్చు; పెంచకపోనూ వచ్చు – భయపడి కూలీ పెంచనూ వచ్చు. భయపెట్టడానికి పోలీసుల్ని పిలిచినా పిలవొచ్చు.

**రాము :** ఏమయినా ఇంక కాయిగాలు అతక బెట్టడానికె పయిసలా జేసుకున్నాం.

**పంతు :** తొందర పడకండి.....కూలీ మాట దేవుడెరుగు. మీకేమన్నా ప్రమాదం జరిగితే?

**రాము :** ఏమైతుందో సూదాం...(కాస్త ఆగి) మీరు మాకో నాలుక్కాయితాలు రాసివ్వాల...

**పంతు :** ఎవరు? నేనా?

**రాము :** మీరు కాకుంటే మాకింకెవరున్నారు పంతులూ? మాకా సదువు రాదు.....

**పంతు :** పటేలుకి తెలిస్తే నా మంచం ఎత్తేస్తాడు.

**రాము :** మా మీద గంత నమ్మకం లేదా పంతులురు

**పంతు :** అయినా –

**రాము :** మీరు సదువుకున్నోల్లు!..మీ సదువు మాకు అక్కరకు రాదా అయ్య?

**పంతు :** చూడు రాములూ! ఇప్పటికే ఈ చుట్టు పక్కలంతా చాలా గందరగోళంగా ఉంది.......ఈ పరిస్థితుల్లో ఏమన్నా రాస్తే –

**రాము :** సరే! మీరు గూడ మాకు సాయం జెయ్యరన్న లెక్క! (కొంచెం నిష్ఠూరంగా) అయితే మీరు గూడ

పోయి ఆ పటేలుతోనె చేతులు కలుపుండ్రి –

పంతు : కోపమెందుకు రాములూ!...అట్లాగే రాసిస్తాలే! వెళ్ళిరా –

రాము : ఒకటి కాదు..ఐదు –

పంతు : అట్లాగేలే!....కాని జాగ్రత్త సుమా!

రాము : గట్లనే!....మల్ల సందేలకొస్తా.....

(వెడతాడు)

కీ.కా : భక్తులారా! ఈ విధంగా రాములు మనసులో నిప్పురవ్వ రాజుకుంది. అది సామాన్యమైంది కాదు. నిద్రపోయే వాళ్ళని, నిస్తబ్దంగా వున్న వాళ్ళను కూడా మేల్కొలుపుతుంది.

వంత1 : నిద్రిస్తున్న అడవుల్ని మండిస్తుంది....

వంత2 : మనమేమిటో మనకు తెలియ చెబుతుంది....భయాన్ని తరిమేస్తుంది.

కీ.కా : శస్త్రాస్త్రాలకు లొంగని, అగ్నికీలలకు ఆహుతి కాని ఆత్మ అంటే ఏమిటో తెలియచేస్తుంది....."నైశం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావక:"....కృష్ణభగవానుడు గీతలో ఏమన్నాడు?

నజాయతే మృయతేవా కదాచిత్
నాయం భూత్వా భవతావా నభూయ:
అజోనిత్య: శాశ్వతోయం పురాణో
నహన్యతే హన్యమానే శరీరే॥

వంత2 : ఆత్మకు చావుపుట్టుకలు లేవు....ఆత్మ అంటే నేనే.....అందుకే ఆత్మకు మృత్యుభయం లేదు.

కీ.కా : అలా నిర్భయాత్మ నిప్పురవ్వలో కలిసి బ్రహ్మమంత శక్తివంతమై నిలుస్తుంది....సరే! ప్రస్తుతానికి వద్దాం.

వంత1 : రాములు రాత్రికి రాత్రి పంతులుగారితో పోస్టర్లు తయారు చేయిస్తున్నాడు.

వంత2 : కాని మన పటేల్ ఏం చేస్తున్నాట్ట?

కీ.కా : ఆయనా? అప్పుడు పార్టీలో మునిగి తేలుతున్నాడు. ఆయత్తం అవుతున్నాడు.

వంత1 : మజాలో మునిగి వున్నాడు.

వంత2 : విదేశీ మద్యం మత్తులో ఉన్నాడు.

కీ.కా : ఆయనొక్కడే కాదు; ఆయన ఫారెస్ట్ ఆఫీసర్ గారికి పార్టీ ఇస్తున్నాడు. ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నాడు.

(ఫారెస్ట్ ఆఫీసర్‌ను విందుకు ఆహ్వానిస్తూ పటేలు.....వెంట గుమాస్తా)

యదు వంశ సుధాంబుధి చంద్ర
స్వామిరార ॥

(ఈ పాట నడుస్తూ వున్నంతసేపూ ఫారెస్ట్ ఆఫీసర్‌కు పటేలు తాగబోస్తు వుంటాడు)

మగువా! అందించవే మదిర.....
జాజిపూవులు

ఫా.ఆ : పటేలూ! ఈ పలావూ, యీ విస్కీ – ప్రతీ చోట దొరికేవే!

పటేల్ : అంతకంటే ఈ అడవిలో ఇంకేం దొరుకుతాయి సార్?

ఫా.ఆ : తప్పు, పటేల్, తప్పు....సరైన అడవి సరుకును రుచిచూడాలి...

పటేల్ : అర్థంకావడం లేదు సార్.......

ఫా.ఆ : ఏం మనిషివోయ్....విరిసిన అడవి మల్లెలంటే నాకెంతో యిష్టం.....

పటేల్ : అంటే –

ఫా.ఆ : విరిసిన అడవి మల్లెలు......(ఆ భావాన్ని సూచిస్తాడు)

పటేల్ : అట్లాగా సార్....అర్థం అయింది సార్....ఒక్క క్షణంలో హాజరు సార్.....

ఫా.ఆ : సరసం తెలిసిన –

పటేల్ : ఇంకా చెప్పక్కర్లేదు సార్ –

(గుమాస్తాని పిలిచి ఏదో చెబుతాడు. గుమాస్తా నిష్క్రమిస్తాడు)

పటేల్ : (నీళ్లు నములుతూ) మీ కొత్త రేంజరు నన్ను చాలా ఇబ్బందులు పెడుతున్నాడు సార్....కాస్త వాడి సంగతి........

ఫా.ఆ : ఆ! కొత్త పిచ్చోడు.....నాల్రోజులు పోనీ, మచ్చిక పడతాడు........నేను పడలా......(పెద్దగా నవ్వి) ఏమంటావ్......నే చెబుతాలే!

పటేల్ : ఆ మాట సెలవిచ్చారు..మాకు నిశ్చింత......

ఫా.ఆ : డోంట్ ఫియర్.....ఇంకో రౌండు వేద్దామా?

(చీకటి.........అందించు మీ మదిరా.....అన్న పాట, సన్నగా)

కీ.కా : ఆ మర్నాడు గోదాములో పని మామూలుగానే మొదలైంది

వంత1 : రాములు పంతులు గారు చేసిన అయిదు పోస్టర్లనీ గోదాములో అంటించాడు. ఆ క్రితం రాత్రే

*ఎంట్రీ ఆల్ కూలీస్: పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా*

వంత2 : పోస్టర్లు అంటిచినప్పటి నుంచీ కూలీలందరూ గుసగుసలాడుతూనే వున్నారు.

వంత1 : పనిచేస్తున్న బెరుకు బెరుకుగా వాకిలివైపుకు చూస్తూనే వున్నారు.

వంత2 : ఏ క్షణంలో ఏం మూడుతుందోనని గుండెలు బిగబట్టుకు పనిచేస్తున్నారు.

వంత1 : పటేల్ ఎప్పుడు వస్తాడోనని భయం!

వంత2 : వచ్చి ఈ పోస్టర్లని చూసి ఏమంటాడోనని భయం.......

కీ.కా : తన వాళ్లు తనకు మద్దతు నిస్తారో యివ్వరో అని రాములు భయం.

(ఇంతలో ఒక కూలివాడు వచ్చి "వస్తున్నాడు" అని సంజ్ఞ చేస్తాడు. అందరూ అది వరకు కన్న వేగం హెచ్చిస్తారు)

అందరూ : పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా॥

................

(పటేలు, గుమాస్తా వస్తారు.....పటేలు పోస్టర్లు చూస్తాడు. మొహం కందగడ్డలా అయిపోయింది....)

**పటేల్ :** (బిగ్గరగా) ఆపండి.......

(నిశ్శబ్దం......అందరూ అతని వంక భయంగా చూస్తారు.)

ఈ పోస్టర్ మళ్ళీ అంటించే ధైర్యం ఎవరి కొచ్చిందిరా? దొంగ గాడిద కొడుకుల్లారా! నిన్ననేగా అరణా పెంచింది? మళ్ళీ ఇవ్వాళ పోస్టరు?..మిమ్మల్ని పట్నం వెధవలెవరో రెచ్చగొడుతున్నారు. లేకపోతే...గొర్రెల మందలు – మీకు ఒక్కసారిగా యింత ధైర్యమా? అందరూ నిశానీ నాయాళ్ళు – మీకు తోడు పోస్టర్లు – ఒకటి కాదు, రెండు కాదు – ఐదు – మీ నాయకుడెవరో ఈ చుట్టుపక్కలే వుండి వుండాలి. ఎవరు దాచారు వాణ్ణి....చెప్పండి ఎవరు దాచారో! లేకపోతే నీ.......పోలీసుల్ని పిలిపించి యిళ్ళన్నీ సోదా చేయిస్తా నా కొడుకుల్లారా!........చెప్పండిరా! నిప్పు పెడతా మీ యిళ్ళకి – ఆఫీసర్లు అంతా నా గుప్పిట్లో వున్నార్రా?...

(కూలీలెవరు మాట్లాడరు....భయంతో పాటు మొండి ధైర్యం కూడా వాళ్ళ మొహాల్లో కనిపిస్తుంది.)

తెలిసింది. ఈ చుట్టుపక్కల పటేళ్ళని ఎవరో పట్నం నాయాళ్ళు కొట్టించారనేగా! ఓరేయ్! ఆ ఎదవల్లాంటి వాణ్ణి కాదురానేను.......నా మీదెవరన్నా చెయ్యి చేసుకుంటే –

(అందరూ నిశ్శబ్దం)

రోజుకు నాలుగు రూపాయలా? మీ అబ్బ సొమ్మేమన్నా దాచిపెట్టార్రా? దొంగ నా కొడుకుల్లారా! ఏమనుకుంటున్నార్రా మీకు? నా కోసం సంపాయిస్తున్నార్రా?.....మీరు పనిచెయ్యకపోతే ఇక్కడ పని ఆగిపోతుందిరా? బయట్నించి వందలమంది కూలీల్ని పిలిపిస్తాన్రా......ఇప్పుడైనా చెప్పండి....ఎవడు మిమ్మల్ని ఉసి కొల్పుతున్నది? ఆ వెధవెవరో చెప్పండి....లేకపోతే మీ ప్రాణాలు దక్కవు.....(గుమాస్తా వైపు తిరిగి) ఎవడితో చెప్పుకుంటారో చెప్పుకోమను. ఒక్క పైసా పెంచేది లేదు.

(పటేల్ వెళ్ళిపోతాడు. కనుకొసల నుంచి ఒకరి నొకరు చూసుకుంటూ ఉంటారు కూలీలు. మాట్టాడకండి అన్నట్లు సైగలు చేసుకుంటారు. గుమాస్తా ఒక్కొక్కరినీ కుదిపి మాట్లాడించాలని ప్రయత్నిస్తాడు. ఎవ్వరూ నోరు మెదపరు)

**కీ.కా :** ఈ విధంగా పటేల్ ధామ్‌ధూమ్ లాడుతూ వెళ్ళిపోయాడు. ఇవ్వాళ కాకపోతే రేపైనా కూలీలు దిగిరారా – అన్న ధీమాతో వెళ్ళాడు.

**వంత1 :** రెండు రోజులు గడిచినా కూలీల్లో కదలికి లేదు...ఎవరన్నా రాజీ ప్రసక్తి తెచ్చినా రాములు వాళ్ళ నోళ్ళు మూయిస్తున్నాడు.

**వంత2 :** వాళ్ళందర్నీ ఒకతాటి మీద నడిపించే శక్తి రాములుకు ఒక్కసారిగా ఎట్లా వచ్చిందో తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంది.

**కీ.కా :** పటేల్ తప్పు చేసి వాడికి మాదిరాగా భయపడుతున్నాడు. కూలీలు మౌనం చూసి, ఇది బయట

వాళ్ళ పనే ననుకుంటున్నాడు.

**వంత1 :** రెండు రోజులు పోయాక –

(పటేల్, గుమాస్తాలు మాట్లాడుకుంటూ వుంటారు)

**పటేల్ :** నువ్వు పట్నంపోయి ఇన్‌స్పెక్టర్‌తో మన కూలీలంతా పనులు మానేసి తిరుగుబాటు చేస్తున్నారని చెప్పు.

**గుమాస్తా :** దీనివల్ల ఏమవుతుంది సార్!

**పటేల్ :** ఆయనొచ్చి వీళ్ళని లాక్కెళ్ళి, జైల్లో పడేసి రెండు రోజులు చితకబాదితే గాని – నాయాళ్ళకి బుద్ధిరాదు.

**గుమాస్తా :** అది నిజమే కాని పని దెబ్బతింటుందే! అడవి నుంచఇ సమయానికి సరుకు వెళ్ళకపోతే – వచ్చేది వానాకాలం సరుకంతా నాశనమై పోతుంది. అందులోనూ బోలెడు ధర పలికే రోజులు!

**పటేల్ :** అయితే కొత్త వాళ్ళని పెట్టు.

**గుమాస్తా :** బయటి వాడొక్కడూ రాడు. పైగా వాళ్లు కూడా కూలీరేటు పెంచితే గాని పనిచెయ్యం అంటే చచ్చిన చావవుతుంది. వాళ్ళకి పని మొదటినుంచీ నేర్పాలి. ఈలోగా కొనుగోలుదార్లు – మనం సరైన టైంకి అందించకపోతే నీ సరుకు మాకక్కర్లేదంటే?

**పటేల్ :** కాని ఈ వెధవలు – వీళ్లని వంచడం ఎలా?

**గుమాస్తా :** అది మీకు వెన్నతో పెట్టిన విద్య! బయటినుంచి ఎవరో వీళ్ళని రెచ్చగొడుతున్నారన్నది ఖాయం. ఇకపోతే తాత్కాలికంగా మరో ఆటణా పెంచండి..

పటేల్ : అందుకు ఒప్పుకుంటానంటారా –

**గుమాస్తా :** నాయాళ్ళు – ఎందుకొప్పుకోరు? ఇట్లా పెంచి కూడా మనం ఎన్నిసార్లు యింతకింతకు లాభాలు సంపాదించలేదు?...పైగా చుట్టుపక్కల జరుగుతున్న విషయాలు వింటుంటే వీళ్ళతో పోట్లాట మనకి మంచిది కాదు అనిపిస్తోంది.

**పటేల్ :** సరే! పెంచెయ్యి ఆఠణా....ఒప్పుకున్నారా సరేసరి! లేకపోతే ఇన్‌స్పెక్టరుతో చెప్పి......

**గుమాస్తా :** చిత్తం......అట్లాగే కానిద్దాం –

(కూలీలు నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. గుమాస్తా వస్తాడు)

**గుమాస్తా :** లేవండిరా! లేచి పనులు మొదలు పెట్టండి.....అయ్యగారు మీ కోరిక మన్నించారు..

**రాము :** అంటే నాలుగు రూపాయలిస్తాడట్నా?

**గుమాస్తా :** ఇస్తాడ్రా, ఇస్తాడు.....ఇవ్వాళకాకపోతే రేపు......నేనెంతో చెప్పిచూశాను...ఊహు! ససేమిరా వినలా! పైసా ఎక్కువివ్వనన్నాడు...పోలీసుల్ని పిలిపిస్తానన్నాడు...కాని నేనే ఒప్పించాను. అన్నీ ప్రియంగా ఉన్నాయి. వాళ్ళు మాత్రం ఎవరినడుగుతారు..మీ కాళ్ళకింద బతుకుతున్నవారు....మీరు కాకపోతే వాళ్ళని చూసేదెవరు – అని చెప్పాను. వాళ్ళకి ఇంకో అర్ధరూపాయిస్తే మీకు నష్టం ఉండదులెండి అని సముదాయించి చెప్పాను. అయినా, మీ మధ్యా వాళ్ళ మధ్యా తరతరాల సంబంధం వుంది....ఇవ్వాళ తెంపేసుకుంటే పోయేదా? ఆయనివ్వాలి, మీరు బతకాలి.........

**రాము :** ఇంతకీ పటేలేమన్నాడు?

**గుమాస్తా :** ఎంతకీ దిగిరాలా. నేనే నచ్చ జెప్పాను.

**కూలీ1 :** ఒప్పుకున్నాడా అని –

**గుమాస్తా :** ముందు ససేమిరా వీల్లేదన్నాడు. తరువాత కొంచెం మెత్తబడ్డాడు. చివరికి సరేనన్నాడు....నచ్చ చెప్పడానికి కూడా ఓ పద్దతి వుంటుంది చూడు...ఆఖరికి ఆరణా పెంచాడు.

(కూలీల్లో కలకలం)

**రాము :** కాని మీ కాయితంలో నా్రలూపాయలనుందిగా.

**గుమాస్తా :** (కోపంతో) వెయ్యిరూపాయలని లేదూ?....ఆవునుంచి పాలు పిండుకోవాలిగాని రక్తం కాదురా!..నేనెంతో కష్టపడి ఆయన్ని ఒప్పిస్తే! నోటిదగ్గరికి వచ్చిన సిద్ధాన్నాన్ని కాదంటా్రరా? నడవండి..(వెడుతూ) ఇక పదండి.....పనిలోకి పదండి......(వెళ్ళిపోతాడు)

**కూలీ2 :** బలే సి్రతంగా వుందే యీ కాయితం!

**కూలీ3 :** దీనవ్వ.....దీన్ని సూసినంక నిన్నో ఆటణా ఇయ్యాల్నో ఆటణా –

**కూలీ4 :** ఇగనుంచి మనం లొల్లి బెట్టకూడదు.

**కూలీ1 :** లేకుంటే ఒచ్చింది గూడబోద్ది.

**కూలీ2 :** ఇదంతా మల్లవ్వ సలవ.....అది గీకాయితం తేకుంటే మనం ఎట్లున్నోల్లం అట్టనే వుండి టోల్లం గదా!

**రాము :** అది గాదరా –

**కూలీ3 :** ఒరే రాములూ! మరీ గంత ఆశకల బోకరా! దొరికిన్దాన్తో నిమ్మలంగుండు.......అరె పొద్దుగూకొచ్చింది.......పన్లోకి పోదాం......పద..........

**అందరూ :**

పనిచెయ్‌రా భాయ్.....పనిచెయ్‌రా

పైసాకోసం పనిచెయ్‌రా

పటేలు కోసం పనిచెయ్‌రా

దేశం కోసం పనిచెయ్‌రా

కాయితం చెప్పింది పనిచెయ్‌రా

పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా

(అందరూ ఆనందంగా పాడుతూ పనిచేస్తూ ఉంటారు)

**కీ.కా :** అయ్యా! అదండీ సంగతి! మొట్టమొదటిసారిగా దోపిడీ విధానం మీద కార్మికుల ఘనవిజయం అది.

**వంత1 :** పటేల్‌లాంటి రావణాసురుల మీద కూడా శాంతంగా తిరగడొచ్చని కార్మికులకు యిప్పుడే తెలిసింది.

**వంత2 :** తిరగబడి ఆయన్ని లొంగదీయొచ్చని కూడా వాళ్ళకిప్పుడే తెలిసింది.

**కీ.కా :** పోస్టర్ చూపిన మహత్తు వల్ల కూలీలు గెలిచారన్నది నిజం.

**వంత1 :** పటేలు ఒక్కసారి రూపాయి కూలీ పెంచాడన్నది నిజమే!

వంత2 : అందరూ సుఖంగా ఉన్నట్టే కదా!
ఇహ "స్వస్తి ప్రజాభ్యాం" అని చెబుదామా?

కీ.కా : పిచ్చివాడా! ఇంకా కథ పూర్తి కాలేదు...అసలు యుద్ధం మొదలైంది ఇప్పుడే!

వంత1 : ఆ! నిజానికి రణభేరి మోగింది యిప్పుడే!

(రాములు పరిగెత్తుకుంటూ వచ్చాడు)

రాము : పంతులుగోరూ!...నాకు మాంఛి పేద్ధ ఉద్దోగం ఏసిండు పటేలు...కొలువెక్కువ జేసిండు.....

పంతు : అట్లాగా! చాలా సంతోషం...ఏమిటో ఆ మాంఛి పేద్ధ ఉద్యోగం?

రాము : అడవిని కొట్టేకాడ నాకింద ఇరవై మంది మనుసుల్నిచ్చాడు.

పంతు : ఆహా! గాంగ్‌లీడర్‌గా వేశాడా? అయితే – కొత్త దంపతుల కాపరం అడవిలో మొదలౌతుంద్నమాట.

రాము : లేదు పంతులూ! నేనొక్కన్నే పోతాన్నా.

పంతు : మరి మల్లవ్వ?

రాము : దానికి అయ్యింటో డూటీ ఏసిండు.

పంతు : అదా సంగతి!

రాము : అదేంది పంతులూ! నా కింత సంబరంగ ఉంటే నీకు ఖుసీ అనిపిస్త లేదా?

పంతు : బాగానే వుంది.....మధ్యలో నాదేం పోయింది.

రాము : పంతులూ! ఏదో దాపెడుతున్నావు? ఏందో చెప్పరాదు.

పంతు : ఊళ్ళో ఇంత  మంది ఉండగా పటేలు నిన్నే గాంగ్‌లీడర్‌గా ఎందుకు వేశాడంటావ్?

రాము : నేంజేసే పన్ని మెచ్చిండు గనక –

పంతు : అంటే, తతిమా వాళ్ళు నీ లాగా పనిచెయ్యలేరంటావా?

రాము : ఏమో! అది నేనెట్టా జెబుతా?

పంతు : సరే! దాన్ని ఒదిలేయ్.......మల్లవ్వని తన ఇంట్లో డ్యూటీమీద వెయ్యడమేమిటి? దాన్ని గూడానీతో పంపొచ్చుగా!

రాము : అదే నాకు సమఝువతల్లే –

పంతు : అర్థం కాకపోవడానికి ఇందులో ఏమీలేదు...పటేల్ నిన్ను ఏదో ఒక నాటికి ఆ గుమాస్తా చేసిగాని ఇదలడనిపిస్తుంది.

రాము : గంటే – ?

పంతు : అంటే ఒక్క దెబ్బకు రెండు పిట్టలు!...నువ్వే వీళ్ళందర్నీ ఎక్కేస్తున్నావని తెలిసుండాలి...దాంతో నిన్ను బులిపించి యిక్కణ్ణుంచి పంపిచేస్తున్నాడు. కాసిని డబ్బులు, కాస్త హోదా వస్తే ఇహ నువ్వు మాట్లాడవు. ఇహ నువ్వు అడవుల్లో వుంటే – గుమాస్తాలాగా –

రాము : జర సమఝు అయ్యేట్టు చెప్పరాదయ్య పంతులు!

పంతు : ఏమీ లేదు రాములూ! వెనక నీలానే గుమాస్తాని కూడా గాంగ్‌లీడర్‌ని చేసి అడవుల్లోకి పంపించి, వాళ్ళావిడని పటేలు తన యింట్లోనే డ్యూటీ వేశాడు. ఇప్పుడావిడ పటేల్‌కి ఏమవుతుందో ఊళ్ళో వాళ్ళందరికీ తెలుసు...

రాము : అంటే మల్లమ్మని? మల్లమ్మని.....లేదు. గట్ల జరిగేటందుకు యీల్లేదు...నే జరగన్వి –

పంతు : చూడు రాములూ! ఇది పెద్ద వాళ్ళతో పని ......చాలా జాగ్రత్తగా మసలుకోవాలి...పటేలు –

రాము : వారెవా! గట్లెట్లయితది? నేనూకుంటానా?

పంతు : నువ్వూరుకున్నా వూరుకోకపోయినా....జరిగేదే.....మొదట్లో కాస్త గుసగుసలు....నవ్వులాటలు....ఆ తరువాత మామూలైపోతుంది. ఇహ ఆ విషయం ఎవ్వరూ పట్టించుకోరు.

రాము : లే. నేను మల్లమ్మ నాయింటికి పంప.

పంతు : మరి గాంగ్‌లీడర్‌వి కాదలుచుకోలేదా?

రాము : గిసుమంటి బాడకోవ్ పనులు జేయించె గాంగ్‌లీడర్ నా కొద్ధి

పంతు : రోజు కూలీ కూడా దొరకదు నీకు, జాగ్రత్త.

రాము : ఎట్లెవ్వడు జూస్తా....గిసుమంటి అన్నాయకాన్ని రువేయించాల పంతులూ!

పంతు : నీ ఒక్కడి వల్లా ఏమవుతుంది?

రాము : ఊరోల్లందర్ని జమాయిస్తా.

పంతు : ఈ విషయంలో ఊరి వాళ్ళెవ్వరూ నీకు సాయం చెయ్యరు. ఇది నీ స్వంత విషయమంటారు...నువ్వూ నీ పెళ్ళాం ఎట్టాబోతే మాకేం అంటారు...నువ్వూ నీ పెళ్ళాం ఎట్టాబోతే మాకేం అంటారు...నువ్వు ఎదురు తిరిగితే పటేల్ నిన్నొక్కణ్ణి పోలీసులకు పట్టించి చితక బాదిస్తాడు.....అరెస్టు చేయిస్తాడు.

రాము : నేనేం చెయ్యందే గట్లెట్ల జేస్తాడు?

పంతు : పిచ్చివాడా! ఏదో ఒకటి చేశాని అరెస్టు చేయిస్తాడు.

రాము : కాయితం అతకబెట్టినప్పుడేం జేసిండు గనక?

పంతు : అది లేదు...ఆ పోస్టర్ వెనకవున్న శక్తికి ఆయన భయపడ్డాడు..దాన్లో నలుగురి స్వార్థమూ కలిసి వుండి కనక ఆయన దిగి వచ్చాడు...ఇది నీ ఒక్కడి విషయం కనక ఆయన దిగి రానక్కర్లేదు...

రాము : నేనిప్పుడింకో కాయితం తెచ్చి అంటిత్తా......“మల్లమ్మ పటేల్ ఇంట్లో పనికి పోది” అని రాయిత్తా.......ఆ కాయితం మీనున్న బొమ్మలు, గుర్తులూ రాయండ్రి....బేజారయితు దిగొత్తాడు నాయాలు.......

పంతు : కాయితం రాయడం, అంటించడం సమస్య కాదు రాములూ కాని మీ వాళ్ళు నీకు మద్దతు నిస్తారా అని సందేహం...ఈ పోట్లాట మొదలైతే ఇది ఒహంతట తేలదు.....మరి మీ వాళ్ళు ముందరే నీళ్ళు కారిపోతే–

రాము : కొపాకంట పోట్టాడేదే పంతులు....మొన్న అతక బెట్టిన కాగితం మాకు బలమిచ్చినట్టే గీ కాగితం గూడ యిస్తది...మీరైతే కాయితం రాసియ్యండ్రి పంతులు.....

పంతు : రాసిస్తాను కాని....కాగితం పులికి ఎవరన్న భయపడతార్రా రాములూ! దాని వెనక నిజమైన పులి ఉన్నదని తెలిస్తే తప్ప – ! నిజమైన పులి అంటే మీరంతా ఒక్క మాటమీద ఉండడం; కలిసికట్టుగ అన్యాయాన్ని ఎదిరించడమే!...ఊరివాళ్ళు నీతో కలవకపోతే నువ్వేం చెయ్యలేవు రాములూ!

రాము : మీరయితే ముందు కాయితం రాసియ్యండ్రి పంతులూ! నేను ఛస్తే మల్లమ్మని ఆడింటికి బంప. అడికి తార్ప......మీరైతే రాసియ్యండ్రి.

: రాసిస్తాను కాని నువ్వు మీ వాళ్ళతో మాట్లాడి వాళ్ళని ఒప్పించు....ఇటువంటప్పుడు ఒట్టి ఆవేశమే

చాలదు. సరైన ఆలోచన కూడా కావాలి......జాగ్రత్త.....మీరంతా ఒకటిగా వుంటే ఆ పటేలు పులిని కాగితం పులిని చెయ్యొచ్చు.....నేను రాసే కాగితం పులిలా పని చెయ్యనూ వచ్చు.......జాగ్రత్త......

(ఇద్దరూ చెరో వైపుకు వెడతారు. వంతలు, కీర్తనకారుడు వస్తారు)

**వంత1 :** అయితే పంతులు గారు పోస్టర్ రాయడానికి వెళ్ళారా?

**వంత2 :** ఆ! ఊళ్ళో వాళ్ళని కూడగట్టుకోవడానికి రాములు వెళ్ళాడు.

**వంత1 :** ఈసారి వ్యవహారం అంత సజావుగా కాదు.

**వంత2 :** ఇది కేవలం రాములికి, మల్లమ్మకి సంబంధించినది....

**వంత1 :** అందరికీ సంబంధించిన విషయాలు కూడా ఒక్కొక్కప్పుడు వ్యక్తిగతంగా మారవూ?

**వంత2 :** అట్లాగే, వ్యక్తిగత విషయాలు కూడా ఒక్కొక్కప్పుడు సమిష్టి సమస్యలవుతాయి......

**కీ.కా :** (వస్తూ)

శత్రువును గుర్తెరగరా
నువ్వు కొత్త దిశ పయనించరా ॥
సీతాపహరణ మైతే
రామ బాణాలు జ్వలియించలేదా?
రావణుడి
పది తలలు ఖండించలేదా?
ద్రౌపదీ వస్త్రాపహరణం
హస్తినను నిలువెల్ల దహియించలేదా?
కౌరవా వంశమును ముడియించలేదా?
ఇవాల్టి ఓటమి రేపటి గెలుపు
కొత్త సూర్యుడికి చీకటి పిలుపు
నివురు గప్పినా నిప్పు రవ్వలు
మహాగ్ని కీలలు కావా?
అవి – మదోన్మత్తులను ముట్టుబెట్టలేవా?॥శత్రువును॥

(రాములు మిగిలిన కూలీలతో మాట్లాడుతూ ఉంటాడు)

**రాము :** అయితే మీరెవరూ నాకు సార్దారీ ఇవ్వరుగా?

**కూలీ1 :** చూడు రాములూ నువ్వూరికే మాటను సాగదీయకు

**కూలీ2 :** నినున గాంగ్‌లీడర్‌ని జేసి నీనోరు నొక్కెస్తే మేమేం జేస్తం?

**కూలీ3 :** రాములూ! నువ్వు మల్లమ్మని మాత్రం గా పటేల్ ఇంటికి పంపొద్దు. గిట్ల ఎంతమంది ఆడోళ్ళని ఆ బద్మాషోనికి బలియిస్తామో –

**కూలీ2 :** అరె! మనకక్కర్లేని గిసుమంటి ఇసయాల్లో ఆయన్తో జగడం బెట్టుకుంటే మంది మొత్తం ఆయనకి

ఇరోదం అవుతం. ఇన్నేల్లుగా వస్తున్నదాన్ని నువ్వు మారుస్తవ, నేను మారుస్తన?

కూలీ1 : నాల్రోజులు నీ పెడ్లం పటేల్ యింట్ల ఉండొస్తె మస్తు బంగారం.

రాము : ధూల్! ఏం కూత కూసినవుర!

కూలీ2 : నువ్వు ఇప్పుడు మొండికి బడి ఏమన్న జేస్తే మనల్ని కాల్చుకు తింటడు పటేలు. మనల్ని పనిలోంచి తీసేసినా తేసేస్తాడు...

కూలీ1 : గంతేనా? పోలీసులకు పట్టిస్తాడు...ఆల్ల పులుసు తినిపిస్తాడు.

రాము : గయితే పోస్టరతక బెట్టినప్పుడు మీలో ఒక్కలూ నోరెత్తలేదేం? అప్పుడు సూతా ఆయ్న కోపంసేసిండుగద

కూలీ2 : అది మనందరి సంగతి....ఇప్పుడట్ట గాదు....కాయితం నువ్వొక్కడివే అతక బెట్టినావన్న సంగతి ఎరికైతది....

కూలీ3 : గీ కాయితాన్ని జాసిగూడ అందరి యవ్వారం అనుకోవచ్చు నేమో పటేలు?

కూలీ4 : ఏమీ అనుకోడు తియ్.....అంత దమ్మాక్ లేనోడా?

కూలీ1 : పోనీ, నీ పెళ్ళాన్ని తీసుకుని ఏడికన్న ఎల్లిపోరాదురా?

రాము : నేనేమంత ఆడంగి రేకులోణ్ణి గాదు.

కూలీ2 : అయితే మేమేనా చేతగానోళ్ళం? అన్న చోటల్లా మన రోసం చూపెట్టద్దు...కాలే కడుపులు గాపకం ఒత్తే ఎక్కడోల్లక్కడ గమ్మునుంటరు.

రాము : గంటే....గంటె మీరంత నన్నొక్కల్ని జేసి పోతారన్నమాట?

(నిశ్శబ్దం)

రాము : నోరిప్పరు? మమ్మల్నిట్ట గాక సోయోనితాన ఇడిసిబెట్టి పోతరన్న గదు? మీదన కొస్తె గాని మీకి తెలిసిరాది....సరె! మీరు నా ఎంట ఉన్న ఉండకున్న నేను కాయితం అతక బెట్టి తీరత...ఏ కాయితం జూచి పటేలు బెదిరుండో అసుమంటి కాయితమె అందులో జెప్తా....మల్లమ్మ ఆడింటికి పనికిపోది అని – అతక బెడతా....ఏమయితుందో కాని.....అరేయ్.....నా పెల్లాన్ని ఆడికి తార్పుతాన్ర?

కూలీ2 : నువ్వేం చేసినా ఆ జిమేదారి నీదె!

రాము : అవున్రా! నాదె! ధూ! చేతగాని ముండ కొడుకుల్లారా!

(మల్లమ్మ లేచి నిలబడ్డది. అందరి వైపు చూస్తూ బిగ్గరగా ఖాండ్రించి ఉమ్మేస్తుంది...రాములు వంకకు తిరిగి "ధూ! పోదాం పా"అంటుంది....అందరూ తల వంచుకు కూర్చుంటారు)

కీ.కా : నాయనలారా! రాములు ఈ విధంగా నిరాశతో వెళ్ళిపోయాడు. కూలీలంతా ఆలోచిస్తూ కూర్చున్నారు. ఈలోగా తెల్లవారింది.

వంత1 :

తెల్లవారెను మేలు కొనరా

అల్లనదె ఉదయాద్రిమీద

కొత్త సూర్యుడు పొడిచెనిప్పుడు ॥మేలుకో నరుడా, మేలుకో॥
కాళ రాత్రి కరిగిపోయెను
కమ్మిన చీకట్లు తొలిగె
అంధకారం చీల్చుకుంటూ
బాలభానుని లేతకిరణం
తట్టినిద్దుర లేపుతున్నది ॥మేలుకో॥
పట్టి పగతుర చీల్చిచెండి
గట్టిమేల్ తలపెట్టలేవోయ్ ॥మేలుకో॥

(పాట ఆగుతూనే కూలీలు గోదాములో పనిచేస్తున్న శబ్దం)

**అందరూ:**
పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా
పైసాకోసం పనిచెయ్‌రా
పటేలు కోసం పనిచెయ్‌రా
పట్వారి కోసం పనిచెయ్‌రా
బువ్వ కోసం పనిచెయ్‌రా
తుపాకి కోసం పనిచెయ్‌రా
దేశం కోసం పనిచెయ్‌రా
పనిచెయ్‌రా భాయ్ పనిచెయ్‌రా

(పాట పై స్థాయికి పోయేసరికి పటేలు వస్తాడు)

**పటేల్ :** ఆపెయ్యండి పని.

(ఎక్కడ వున్న వాళ్ళు అక్కడే ఆగిపోతారు)

**పటేల్ :** రాములూ! నువ్వు అడవిలోకి పోలేదేం?

(నిశ్శబ్దం)

**పటేల్ :** మల్లమ్మని మా ఇంటికెందుకు పంపలేదు?

(నిశ్శబ్దం)

**పటేల్ :** మాట్లాడవేం? మా యింటికొస్తే దాన్నేమన్నా కొరుక్కుతింటాననుకున్నావా?

(నిశ్శబ్దం)

**పటేల్ :** మాట్లాడవేరా పొగరుబోతా! నేను చెప్పిందానికి ఎదురు తిరిగేటంత ధైర్యం మీకెక్కడ్నుంచి వస్తోందిరా?

(నిశ్శబ్దం)

**పటేల్ :** మళ్ళీ ఎవడో మిమ్మల్ని రెచ్చగొడుతున్నట్టున్నాడు. లేకపోతే, దేన్ని చూసుకుని రా మీకింత పొగరు?

(రాములు పోస్టర్ వంక చూస్తాడు. పటేల్ కూడా అటు చూస్తాడు. కంగారు పడిపోతాడు.)

**పటేల్ :** మళ్ళీ పోస్టరు! అదె గుర్తు....మల్లమ్మ మా యింటికి రాదా? చెప్పండి, ఎవరంటించారీ పోస్టరు? ఎవడ్రా నాయకుడు? వాడు నా ప్రతి విషయంలోను ఎందుకు జోక్యం కలిగించుకుంటున్నాడు? రాత్రికి రాత్రే పోస్టర్లు అంటిస్తాడా? ఎవడ్రా అది? ....నా ప్రతి సంగతి వాడికెందకురా చెప్పండిరా –

(నిశ్శబ్దం)

**పటేల్ :** (రాములు దగ్గరకు వచ్చి) నీకు తెలిసివుండాలి....ఇది నీ ఒక్కడికే సంబంధించిన విషయం కదూ! ఏడుస్తూ పోయి ఫిర్యాదు చేసివుంటావు. చెప్పు....నా వెంటపడ్డ ఆ వెధవెవడో చెప్పు......

(నిశ్శబ్దం)

**పటేల్ :** చెప్పరా. చెప్పు వాడెవడో..అంటే చుట్టు పక్కల ఊళ్ళలో తిరుగుతున్న వెధవలు నా ఊరికి కూడా చేరుకున్నారన్నమాట!...చెప్పరా, చెప్పు....చెప్పక పోతే తోలు వలిచేస్తాను...

(నిశ్శబ్దం)

**పటేల్ :** ఈ నమ్మక ద్రోహులకి ప్రతీకారం చెయ్యకతప్పదు....ఆఖరిసారిగి అడుగుతున్నాను..చెప్పు... వాడెవడో!

(నిశ్శబ్దం)

**పటేల్ :** అట్లా వూరికే ఎట్లా చెబుతావురా! నాలుగంటిస్తే కాని –

(గుమాస్తా దగ్గర హంటర్ తీసుకుని రాములిని బాగి కొడతాడు...రాములు బాధతో అరుస్తాడు. కాని మాట్లాడడు. పటేల్ కొడుతూనే వుంటాడు)

**పటేల్ :** చెప్పరా నా కొడకా.....ఎవడ్రావాడు? ఎవడు?

(మల్లమ్మ నెమ్మదిగా లేచి పటేల్ మీద ఉమ్మేస్తుంది)

నీక్కూడా ఎంత ధైర్య వచ్చిందే! అంటే బహిరంగంగా మీరంతా నన్ను, నా పెత్తనాన్ని సవాలు చేస్తున్నారన్నమాట!....దీన్ని.....దీన్ని ఇప్పుడు కుక్కను ఈడ్చుకుపోయినట్టు ఈడ్చుకుపోతాను...ఎవడు అడ్డంవస్తాడో చూస్తాను....పిలవరా మీ నాయకుణ్ణి....నన్ను ఎవడు అడ్డుకుంటాడో చూస్తా –

(మల్లమ్మను పట్టుకుంటాడు)

**కూలీ3 :** మెల్లగా లేస్తాడు....పటేలు దగ్గరకి వచ్చి) చెయ్యి ఇడు

**పటేల్ :** అదా సంగతి! అంతా కలిసి ఆడుతున్నారన్న మాట ఈ నాటకం!

**కూలీ3 :** ఇడుస్తావా లేదా దాని చెయ్యి?

**పటేల్ :** నేను వదల్నురా....ఏం చేస్తావో చెయ్యి....

**కూలీ3 :** ఏంచేస్తానా? నీ యవ్వ –

(ఒక్క ఉదటున పటేల్ మెడ పట్టుకుంటాడు...రాములు వాడి వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోతాడు. నెమ్మదిగా పటేల్ చేతిలోంచి కొరడా తీసుకుంటాడు మూడవ కూలీ.)

**రాము :** నువ్వాగు మావా! ఈడి సంగతి నేను చూసుకుంటా

(పటేల్‌ని పడేసి కొడుతూ వుంటాడు. గుమాస్తా అదను చూసి పారిపోతాడు)

**పటేల్ :** ఒరే రాములూ! ఆపు...లేకపోతే పోలీసుల్ని తీసుకువచ్చి మీమీద గుళ్ళ వర్షం కురిపిస్తా....

**రాము :** ఆళ్ళొస్తారా నీకు మద్దతు? చూదాం...ఆళ్ళ సంగతి తరవాత. ముందు నీ సంగతి తేల్చుకోనీ...

**పటేల్ :** ఆపరా ఆపు....నా తడాఖా ఏమిటో తెలియకుండా ఉంది నీకు....నన్ను కొట్టినందుకు నువ్వు తప్పించుకోలేవు లే!

(రాములు కొడుతూనే వుంటాడు)

**పటేల్ :** ఒరేయ్! మల్లమ్మని మా యింటికి పంపించక్కరలేదు..నన్ను చంపకండిరా....మీకు రోజుకి నాలుగు రూపాయల కూలీ కావాలి కదరా! తీసుకోండి...నన్ను మాత్రం వదిలి పెట్టండి..మీ కాళ్ళ మీద పడతాను....

(నెమ్మదిగా కూలీలందరూ పటేల్‌ని చుట్టు ముడతారు. రాములు చేతిలో కొరాడా అలానే ఉంది.)

**కీ.కా :**

పోరు సాగుతుంది.
రణభేరి మోగుతోంది ॥పోరు॥
పల్లె పల్లెలో పంటపొలాల్లో
లోయలోయలో కొండకోనలో ॥పోరు॥
నరమాంసం మరిగిన పులిలా
అధికారం – మీది కురుకుతోంది
మృత్యువు – నోరు తెరుస్తోంది
అందుకే – ॥పోరు॥
ప్రకృతిలో ప్రతి పచ్చని ఆకూ
మల్లమ్మెత్తిన బావుటా
ప్రకృతిలో ప్రతి పచ్చని ఆకూ
రామయ్యెత్తిన బావుటా ॥పోరు॥

**కీ.కా :** అదన్నమాట ఆవూరి కథ. పొరపాటున ఊళ్ళోకి కొట్టుకు వచ్చిన పోస్టర్ యుద్ధానికి నాంది అయింది.

**వంత1 :** ఊళ్ళోని జడత్వాన్ని పోగొట్టింది. సంఘటితంగా ఉంటే ఎదుర్కొనే సమస్య అంటూ ఉండదని చెప్పింది.

**వంత2 :** అన్యాయాన్ని ఎదిరించగలగాలి...అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది – అని చెప్పిందీ కథ.

**కీ.కా :** అయితే మీ ఊళ్ళో ఒక్క రాములు కూడా లేడా?

వంత1 : మీ ఊళ్ళో ఒక్క పంతులుగారు కూడా లేడా?

వంత2 : ఏం? మీ వూళ్ళో పోస్టర్లు అంటించే ప్రాణే లేదా?

కీ.కా : మీ ఊళ్ళో పటేల్ మొహం మీద ఉమ్మేసే మల్లమ్మ కూడా లేదా?

వంత1 : ఏం? మీ ఊళ్ళో వాళ్ళ అంతరాత్మలు అంత చచ్చిపోయాయా?

వంత2 : ఇక్కడి మగాళ్ళంతా గాజులు తొడిగించుకున్నారా?

(కలకలం)

కీ.కా : అదే నిజమైతే నేనిక్కడికి రావడం శుద్ధ దండగ.

వంత1 : రావణ్ణి చంపడమే నిజమైన ధర్మం.

వంత2 : మంచిని సాధించడానికి మరో మార్గం లేనప్పుడు యుద్ధం చెయ్యడమే సరైన మార్గం...అని చెప్పిందీ కథ.

శ్రోత1 : అయ్యా! మీ కథ చాలా బావుంది...కాని రాములు సంగతి ఏమయిందో చెప్పలేదు...మల్లమ్మ నిజంగా పటేలు బాగుపడ్డాడా? మనసు మార్చుకున్నాడా? పోలీసులూ, న్యాయస్థానాలూ రాములుకు సహాయంగా వచ్చాయా? ఆ ఊళ్ళో దుష్టశిక్షణ, శిష్ట రక్షణ జరిగి జనం హాయిగా వున్నారా?

కీ.కా : లేదు నాయనా! నువ్వు అనుకున్న రామరాజ్యం రాలేదు. చేజిక్కిన శత్రువును వదిలినందుకు వాళ్ళంతా ఫలితం అనుభవించాల్సి వచ్చింది.

వంత1 : దయతో తాచుపామును వదిలిపెడితే కాటెయ్యక మానుతుందా?

వంత2 : పాముకన్న విషప్పుచ్చ మనిషి – అందులోనూ పగపట్టిన మనిషి – అందునా డబ్బు, అధికారం ఉన్న మనిషి –

శ్రోత1 : అదే మాకు కూడా పెద్ద సందేహం.....నిజానికి మేము పిరికివాళ్ళం కాదు....మేము అంతటి నేరం చేసిన ఆ పాపికి భయపడుతున్నాం అనుకున్నారా?..కావాలంటే ఒక్కరోజులో వాడి అడ్డును తొలిగించుకోవచ్చు.....

కీ.కా : అట్లాగా! మరి ఎందుకు తొలిగించుకోలేదు?

శ్రోత1 : భయం....తరతరాలుగా పారంపర్యంగా వస్తున్న అధికారం అంటే భయం. ఆ అధికారం మేము

??????????????????????????????????????????????????????????????

వాడే మరో రూపంలో ప్రత్యక్షం అవుతాడు. పటేలు, పట్వారీ, పోలీసు, హవల్దారు, ఫారెస్ట్ ఆఫీసరు..ఏదో ఒక రూపంలో యీ హింస కొనసాగుతూనే వుంటుంది. అయ్యా! ఇవన్నీ గొప్పవాళ్ళ చేతిగోళ్ళకున్న శక్తి. అదృశ్యంగా మమ్మల్ని ఖండ ఖండాలుగా చీల్చి చెండాడే శక్తి ఆ గోళ్ళకి ఉంది.....హింసించే చెయ్యి అదృశ్యంగా ఉంటే దాన్ని శిక్షించే దెవరు?.....ఇప్పుడు చెప్పండి. మల్లమ్మ కేమయింది? ఊళ్ళో వాళ్ళకేమన్నా కీడు జరిగిందా?

కీ.కా : ఇంకా జరిగేటందుకేముంది? గుమాస్తా పోలీసుల్ని పిలుచుకొచ్చాడు.

వంత1 : కూలీవాళ్ళని పోలీసులు చావబాదారు.

వంత2 : వాళ్ళగుడిసెలకి నిప్పు పెట్టారు.

కీ.కా : రాములికి, వాడికి సాయం చేసినవాళ్ళకి హత్యా ప్రయత్నం చేశారన్న నేరం మీద పదేసేళ్ళు జైలు

శిక్ష వేశారు.

శ్రోత 1 : మరి మల్లమ్మ సంగతి?

వంత 1 : మల్లమ్మ గురించి చెప్పేందుకేముంది?

వంత 2 : ఎక్కడికి తీసుకు వెళ్ళడానికి వీలులేదని రాములు మల్లమ్మ ఈ యుద్ధం సాగించారో, ఆమెని చివరికి అక్కడికే ఈడ్చుకుపోయారు.

శ్రోత 1 : ఇహ మనగతి కూడా యింతేనా?...ధనం కావాలనుకోవచ్చు; అధికారం కోసం పాకులాడవచ్చు..కాని ఆ రెంటికి పర్యవసానం దిక్కులేని వాళ్ళమీద అత్యాచారం చెయ్యడమేనా? పెద్దమనుషుల్లా చెలామణి అవుతూ పాపాలు చేసే యీ జనం – మందీ మార్బలాన్ని కూర్చుకుని దౌర్జన్యం చేసే యీ జనం – వీళ్ళంటే భయపడే నేను కూడా ఈ దుర్మార్గుల పేర్లు చెప్పలేకపోతున్నాను...ఏం చెబితే ఏం మూడుతుందో నని మాలో ప్రతి ఒక్కడికీ భయమే!

కీ.కా : చెప్పొద్దనుకుంటే చెప్పకండి...నేను మిమ్మల్నెవరినీ బలవంతం చెయ్యడం లేదు. నే చెప్పేదొక్కటే! వాళ్ళ అత్యాచారాల్ని, దౌర్జన్యాన్ని మీరు ఎదిరించలేకపోతే వాళ్ళు పెట్టే హింసల్ని భరించడానికి సిద్ధంగా ఉండాలి...కాని ఒకటి మాత్రం గుర్తుంచుకోండి...విరోధించారా – ఇంతకన్న హింస అనుభవించాలి...అందుకు సిద్ధంగా ఉండాలి....

నేను హరిదాసుని...దేవుణ్ణి గురించి మీరు నన్ను చెప్పనివ్వలేదు..రామరాజ్యాన్ని గురించి చెబుదామని వచ్చి రావణ రాజ్యాన్ని గురించి చెప్పాను.

ఇహ అటువంటి రావణాసురుల బారినుంచి తప్పించుకోడం, తప్పించుకోకపోవడం మీ యిష్టం...రాములు తాను మొదలుపెట్టిన పనిని ఆపకుండా ఉండాల్సింది...అతను ఎత్తిన చేతిని దించకుండా ఉంచాల్సిన భారం ఆ వూరి ప్రజల్ది. వాళ్ళు ఆ పని చెయ్యలేదు...మీ ఆడవాళ్ళకి జరుగుతున్న అవమానాల్ని, అమాయకులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవాలంటే అటువంటి రావణాసురుల దురాగతాల్ని బట్టబయలు చేసే ధైర్యం కావాలి..నలుగురూ అందుకు కంకణం కట్టుకోవాలి...దుష్టశిక్షణ కోసం ఎత్తిన చేతిని దించకూడదు.

శ్రోత 1 : అవును...అదే సరైన సమాధానం..ఇప్పుడు నేనూ అదే చేస్తాను...ఎత్తిన చేతిని దించకూడదు..మాలాంటి బాధా సర్పదుష్టులందరూ ఇదే మాట మీద నిలబడాలి...మా వాళ్ళందరికీ ఇదే మాట చెబుతాను..."సమిష్టిగా నిలబడండి...అన్యాయాన్ని రాక్షసత్వాన్ని నిర్భయంగా ఎదిరించండి" అని చెబుతాను పట్టుదలతో బిగించిన పిడికిల్ని కోపంతో బిగించిన పిడికిల్ని విప్పొద్దని చెబుతాను.....

బిగించిన పిడికిలి విప్పాలెందుకు
ఎందుకు ఎందుకు ఎందుకు?
ఎలుగెత్తే చేతులు దించితే
పోరాడే చేతులు వంగితే
అవి చేసేదేమిటి
ఏమిటి ఏమిటి ఏమిటి?

కనిపించిన వాళ్ళకి మొక్కడం
కనిపించిన కాళ్ళకి మొక్కడం
వద్దు వద్దు వద్దు –
ఆక్రందన జీవికగా
అనాధలై బ్రతకడమెందుకు?
ఎందుకు ఎందుకు ఎంఉకదు?
గుండె బలం నీది
శ్రమించే కండబలం నీది
కండకావరం, కార్పణ్యం
నిను కాలరాచి నలిపేసే టప్పుడు॥
బిగించిన పిడకిలిని విప్పావెందుకు?
ఎందుకు ఎందుకు ఎందుకు?
నినదిచే చేతిని దించావెందుకు
ఎందుకు ఎందుకు ఎందుకు?
దయచూపే ఆసాములు, అన్నలు
ఎందరెందరున్నా
శ్రమశక్తీ, నీయుక్తీ
చివరికలే రక్ష –
శ్రామిక జన స్వయంరక్ష
కదే బాలశిక్ష –
కరిగించిన నీ కండరాల చేవ
బలిపెట్టిన ఆడదాని మానం
రక్కసి మూకల దహన కాండలకు
ఎరపోయే చీకటి రోజున
బిగించిన పిడికిలి విప్పావెందుకు?
ఎందుకు ఎందుకు ఎందుకు?
నినదించే చేతిని దించావెందుకు?
ఎందుకు ఎందుకు ఎందుకు?

**కీ.కా** : ఆ! ఇప్పుడు నేను వచ్చిన పని సంపూర్ణంగా ముగిసింది...దేవుణ్ణి గురించి నన్ను చెప్ప నివ్వకపోయినా మనిషిని గురించి చెప్పనిచ్చారు....మానవతని గురించి చెప్పనిచ్చారు.....రాముడు బాణం ఎక్కు పెడితే దాన్ని సంహరించుకోడు. మంచికోసం చేసే ఏ పనినైనా అంతే! ఆనాటి రాముడి చేతి బాణానికి తిరుగు లేదు. ఈనాటి రాముళ్ళ గళాలకి తిరుగుండకూడదు.

ఎక్కడ దుర్మార్గం శిక్షించబడి

మంచి నిలబడుతుందో అదే రామరాజ్యం

రాముణ్ణి గురించి తలుచుకోవడానికి, హరిభజన చెయ్యడానికి యింతకన్న ఫలితం ఏముంటుంది? సర్వేజనా స్సుఖినోభవంతు అంటూ రుషులు మనవతకు పాడిన మంగళగీతం తప్ప ఏ కథకైనా ముగింపు ఏముంటుంది? అందుకే నాతో గొంతు కలపండి – ఆనాటి వ్యాస మహర్షి ఏమన్నాడు?

నత్వహం కామయే రాజ్యం, న స్వర్గం ననా పునర్భవకు
కామయే దు:ఖతప్తానాం, ప్రాణినాం ఆర్తినాశనమ్ –

"రాజ్య సంపదలు కోరను, స్వర్గాన్ని, జన్మరాహిత్యాన్ని కోరను. దు:ఖతప్తులైన ప్రాణికోటి ఆర్తిని, దు:ఖాన్ని తొలిగించాలనే నేను కోరుతున్నాను" అన్నాడు. ఆ మహానుభావుడు, అదే నేటి భాగవతంలో – అదే మనందరి ధ్యేయం కావాలి..దు:ఖార్తుల కన్నీటికి కారణమైన దుష్టుల్ని శిక్షించమని, మంచిని పెంచమనీ ఆ రాములవారిని అడుగుదాం – త్యాగరాజుల వారు అడిగినట్లే –

ఏదీ బాహు బల పరాక్రమం ఎన్నాళ్ళు ఎన్నాళ్ళు
ఏతీ ఆ జన రక్షణం ఎన్నాళ్ళు ఎన్నాళ్ళు
కరమున మెరిసే నరచాపము
ఆకలి గొనలేదా? ॥ఏదీ నీ బల పరాక్రమం॥
మురఖర శోణిత పానము
బహుదినములు శీవేదో? ॥ఏదీ అశ్రిత జన రక్షణ॥
వరుస తప్పుబుద్దులు
నీచులకు వచ్చినది తెలియదా? ॥ఏదీ నీ బల పరాక్రమ॥
వెరపు కాక తిరగేరు
చాలనుచు వేగమే
శ్రీ త్యాగరాజసుత ॥ఏదీ నీ బాహుబల పరాక్రమం ఎన్నాళ్ళు ఎన్నాళ్ళు
ఏదీ నీ ఆశ్రిత జన రక్షణం? ఎన్నాళ్ళు ఎన్నాళ్ళు
ఏదీ ఏదీ ఏదీ?